**PCW తెలుగు దినపత్రిక**

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 58 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 24 ఫిబ్రవరి 2026


### రోడ్డు ప్రమాదాల కారణంగా దేశ భవిష్యత్తైన యువతను కోల్పోతున్నాం



3లో

### టిజి ఈడీ సెట్ 2026 నోటిఫికేషన్ విడుదల




3లో

# రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు సిద్ధం కండి

**రానున్న ఎన్నికల్లో అత్యధిక ఎంపి స్థానాలు దక్కేలా కృషి**

**దేశ సమస్యలకు అదొక్కటే పరిష్కారం**

**డిసిసి అధ్యక్షుల శిక్షణాశిబిరంలో డిప్యూటి సిఎం భట్టి**

**వికారాబాద్,ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితేనే ఈ దేశంలోనే రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని, ఆయనను ప్రధానమంత్రిగా చేసే వరకు రెండు రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నిరంతరం పనిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రెండు రాష్ట్రాల్లో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకునేలా కృషి చేయాలని డిప్యూటీ సీఎంఅన్నారు.**మిగతాది** 2లో...



## దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

**సుప్రీం తీర్పుతో దారికొచ్చిన ప్రభుత్వం**

**మంగళవారం నుంచి నిలిపివేస్తున్నట్లు వెల్లడి**

**అమెరికా కస్టమ్స్ శాఖ ప్రకటన విడుదల**



**వాషింగ్టన్,ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** దిగుమతులపై సుంకాల విధింపును మంగళవారం నుంచీ నిలిపి వేయనున్నామని అమెరికా కస్టమ్స్ శాఖ తాజాగా ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక ఎమర్జెన్సీ పేరిట ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు ఇటీవల తీర్పునిచ్చిన నేపథ్యంలో యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్స్ ప్రొటెక్షన్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది.**మిగతాది** 2లో...

## పలు జిల్లాల్లో వడగళ్ల వాన

**పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం -పంటలకు తీవ్రంగా నష్టంతో రైతుల ఆందోళన**

**హైదరాబాద్,ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం అకస్మాత్తుగా వడగళ్లతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి.. వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్దిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో వడగళ్ల వాన తీవ్రంగా కురిసింది. **మిగతా** 2లో...



## అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

**విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ**

**జిఎంఆర్,ఫిక్కీ సంస్థలతో ఒప్పందం**

**ఉపాధి బాధ్యత కూడా ప్రభుత్వానిదే అన్న సీతక్క**

**హైదరాబాద్,ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** అనాథ పిల్లల ఉద్యోగ కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అథారిటీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీతో (ఫిక్కీ) తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న అనాథ యువతకు విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ కల్పన దిశలో ఒప్పందాలు జరిగాయి. ఎయిర్‌పోర్టు ఆపరేషన్, కార్గో, **మిగతాది** 2లో...



## బీహార్‌లో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ అరెస్ట్

**రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసు**

**అమరావతి,ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ, మిగతా2లో...



## సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

**ఏకసభ్య కమిషన్ విచారణపై పిటిషన్ కొట్టివేత**

**కల్తీ నెయ్యి వ్యవహారంలో దర్యాప్తునకు మార్గమం సుగమం**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఓవర్ లాపింగ్ కిందకు రాదని.. పరిపాలనాపరమైన లోపాల గుర్తింపునకు ఏర్పాటు చేసిందని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై దర్యాప్తు కోసం 2లో...



## జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం

**జోగులాంబ గద్వాల జిల్లాలో రైతు సంఘర్షణ సభలో పాల్గొన్న కవిత**

**భవిష్యత్తులో జోగులాంబ జిల్లా నుంచే కార్యక్రమాలు చేపడతామని హామీ**

**నడిగడ్డను బీఆర్ఎస్ మోసం చేసిందన్న కవిత**



2లో

## తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతం

**పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం**

**పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వెల్లడి**

**ఈ నెల 26 నుంచి 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం**

**జిల్లాలు, లోక్ సభ సభ్యుల వారీగా ఇన్‌ఛార్జుల నియామకం**

**హైదరాబాద్,ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జనసేన తెలంగాణ విభాగం ప్రకటన విడుదల చేసింది. సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. జనసేన పార్టీ 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించాలని **మిగతా** 2లో...



## రాజమండ్రిలో పాలకల్తీతో కిడ్నీ ఫెయిల్యూర్

**ఇప్పటికే నలుగురు మృతి..మరో నలుగురి పరిస్థితి విషమం**

**పాలవ్యాపారి గణేశ్ అరెస్ట్.. పరీక్షలకు పాల నమూనాలు**

**రాజమహేంద్రవరం, 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యలతో ఆస్పత్రుల్లో చేరిన వారిలో మరో ఇద్దరు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. చికిత్స పొందుతూ లాలాచెరువు చౌడేశ్వరినగర్‌కు చెందిన ఎన్.శేషగిరిరావు (72), రాధా కృష్ణమూర్తి (74) సోమవారం ఉదయం చనిపోయారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా పాలు కల్తీ కావడంతో **మిగతాది** 2లో...



## హైదరాబాద్ మెట్రో పూర్తిగా ప్రభుత్వ స్వాధీనం

**ఎల్ అండ్ టీతో సూత్రప్రాయంగా గత ఏడాది ఒప్పందం**

**రూ.13 వేల కోట్ల రుణాలను బదలాయించుకోనున్న ప్రభుత్వం**



2లో

PCW తెలుగు దినపత్రిక



# దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

(మొదటి పేజి తరువాయి

ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనమిక్ పవర్స్ చట్టం కింద సుంకాల వసూళ్లను నిలిపివేస్తున్నట్టు తెలిపింది. అమెరికా కాలమానం ప్రకారం, మంగళవారం అర్ధరాత్రి 12.01 నుంచి ఇది అమల్లోకి వస్తుందని పేర్కొంది.సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన మూడు రోజులకు కస్టమ్స్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. వెంటనే సుంకాల వసూలును ఎందుకు నిలిపివేయలేదో చెప్పలేదు. ఇప్పటివరకూ వసూలు చేసిన సుంకాల డబ్బును రీఫండ్ చేయడంపై కూడా క్లారిటీ ఇవ్వలేదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై కొత్తగా 10 శాతం కనీస సుంకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దాన్ని 15 శాతానికి పెంచారు. ఐఈఈపీఏ చట్టానికి బదులు వాణిజ్య చట్టం–1974లోని సెక్షన్ 122 కింద సర్‌చార్జ్ పేరిట ఈ సుంకాలకు తెరతీశారు. అయితే, అమెరికా చట్టసభల అనుమతి లేనిదే వీటిని కూడా 150 రోజులకు మించి పొడిగించే అవకాశం లేదు. ఇక జాతీయ భద్రత పేరిట స్టీల్, అల్యూమినియం, సెమీకండక్టర్స్, ఆటో రంగాలపై గతంలో విధించిన సుంకాలనూ ట్రంప్ కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శాశ్వత ప్రాతిపదికన సుంకాలు విధించేందుకు మార్గాలను అన్వేషించాలని వాణిజ్య విభాగానికి ఆయన సూచించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇకపోతే సుంకాల విధింపు చెల్లదంటూ అమెరికా సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వానికి కొత్త చిక్కులు మొదలయ్యాయి. సుంకాల వల్ల ఇప్పటివరకూ అధిక ధరలు చెల్లించిన అమెరికన్ కస్టమర్లు తమకు రీఫండ్స్ కావాలని పట్టుబడుతున్నారు. ఈ జాబితాలో ట్రంప్ రాజకీయ ప్రత్యర్థులతో పాటు కార్పొరేట్ కంపెనీలు కూడా ఉన్నాయి. అయితే, ఈ పక్రియ అంత సులభం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు.తాను విధించిన సుంకాల భారం విదేశీ ఎగుమతిదారులపై తప్ప సామాన్య అమెరికన్లు, అమెరికా దిగుమతి దారులపై లేదని ట్రంప్ ఇప్పటివరకూ చెబుతూ వచ్చారు. అయితే, ఆయన రాజకీయ ప్రత్యర్థులు మాత్రం ఈ వాదనతో మొదటి నుంచీ విభేదిస్తున్నారు. అధిక సుంకాల భారాన్ని సామాన్య అమెరికన్లే భరించాల్సి వచ్చిందని మండిపడేవారు. ఇక సుప్రీం తీర్పు తరువాత ఇల్లినాయ్ రాష్ట్ర గవర్నర్ సుంకాల రీఫండ్స్ కోరుతూ ట్రంప్‌నకు బిల్లులు పంపించారు. సుంకాల కారణంగా తమ రాష్ట్రం 9 బిలియన్ డాలర్లు అధికంగా చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. తమ రాష్ట్రంలోని ఒక్కో కుటుంబంపై సగటున 1,700 డాలర్ల అదనపు భారం పడిందని అన్నారు. ఇక కార్పొరేట్ కంపెనీలు కూడా రీఫండ్స్‌కు సిద్ధమవుతున్నాయి. కాస్ట్‌కో, రెవ్లాన్ వంటి పలు సంస్థలు ఇప్పటికే కేసులు దాఖలు చేశాయి. ఇప్పటివరకూ ట్రంప్ ప్రభుత్వం సుంకాల పేరిట 133 బిలియన్‌ల నుంచి 175 బిలియన్ డాలర్ల మేర వసూలు చేసి ఉంటుందని అమెరికా వర్గాలు భావిస్తున్నాయి. సుంకాల డబ్బులో ఎంతో కొంత తిరిగిస్తామని ట్రంప్ వర్గం ఇప్పటికే పలుమార్లు తెలిపింది. అయితే, ఇది అంత ఆషామాషీ వ్యవహారం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు. సామాన్య ప్రజలకు నేరుగా రీఫండ్స్ అందే అవకాశాలు తక్కువని ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ కూడా పేర్కొన్నారు. రీఫండ్స్‌లో అధికభాగం దిగుమతిదారులు, అమెరికన్ కంపెనీలకే వెళుతుందని చెబుతున్నారు. విదేశీ ఉత్పత్తుల దిగుమతి సమయంలో వీరే కస్టమ్స్ శాఖకు నేరుగా సుంకాల రూపంలో అధిక ధరలను చెల్లించారని వివరిస్తున్నారు. రీఫండ్స్ పక్రియ కూడా సంక్లిష్టంగా ఉంటుందని ఇప్పటికే జస్టిస్ ఏమీ కోనీ బేరెట్, జస్టిస్ బ్రెట్ కేవనా హెచ్చరించారు. ఈ విషయంలో కోర్టు కేసులు కొలిక్కి వచ్చేసరికి రెండు నుంచి నాలుగేళ్ల సమయం పడుతుందని ట్రంప్ కూడా ఇటీవల ఓ సందర్భంలో స్వయంగా అంగీకరించారు. వేల కొద్ది దిగుమతిదారుల రిఫండ్స్ అభ్యర్థనలను పరిశీలించడం కస్టమ్స్ శాఖకూ భారంగా మారుతుందని అంటున్నారు. ఇక అంతర్జాతీయ స్థాయిలో కూడా ట్రంప్ సర్కారు పలు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. న్యూయార్క్ ఫెడ్, జేపీ మోర్గన్, కీల్ ఇన్‌స్టిట్యూ?ట్ అంచనా ప్రకారం, కస్టమ్స్ శాఖ వసూలు చేసిన సుంకాల్లో 90 నుంచి 96 శాతం అమెరికన్ల జేబుల్లోంచే వెళ్లాయి. భారత్, చైనా, మెక్సికో లాంటి దేశాలు తమ ఉత్పత్తుల ధరల తగ్గింపు రూపంలో 4–10 శాతం మాత్రమే సుంకాల భారాన్ని భరించాయి.

# పలు జిల్లాల్లో వడగళ్ల వాన

(మొదటి పేజి తరువాయి

భారీ గాలులు, వడగళ్ల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, ఇతర వాణిజ్య పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు చెట్లు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే సిద్దిపేట, దుబ్బాక పట్టణాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో పలు రహదారులు జలమయ మయ్యాయి. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ వర్షాలతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే ఎండ తీవ్రత పెరుగుతండగా.. ఒక్కసారిగా వడగళ్ల వాన, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే రైతులకు మాత్రం తీవ్ర నష్టం కలిగింది. వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, కూరగాయల పంటలు, ఇతర వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగళ్ల వర్షంతో పంటలు నేలకూలిపోయాయి. అలాగే మరోవైపు ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. నష్టాలను అంచనా వేయడానికి సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నారు. రైతులకు నష్టం జరిగిన ప్రాంతాల్లో నివేదికలు సేకరిస్తున్నారు.

# రాహుల్ గాంధీ ప్రధాని చేసేందుకు సిద్ధం కండి

(మొదటి పేజి తరువాయి

వికారాబాద్ లో నిర్వహిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. కుల సమస్యలు, రిజర్వేషన్లు, కాంగ్రెస్ వాదిగా కుల వివక్ష నిర్మూలనకు ఎలా పోరాటం చేయాలన్న అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. దేశంలో అంటరానితనం, వివక్ష సమస్య ఎక్కడ ఎదురైనా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షం అవుతారని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల కుల వివక్షను భరించలేక బలవన్మరణానికి పాల్పడితే రాహుల్ గాంధీ నేరుగా యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులతో చర్చించి పోరాట విధానాన్ని ఖరారు చేశారని తెలిపారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను ఎవరిని కూడా యూనివర్సిటీలోకి రానివ్వలేదు అంటరానితనం సమస్యను సమస్యగా చూడాలి తప్ప రాజకీయ జోక్యం ఉండకూడదన్నది ఆయన ఆలోచన అని వివరించారు. ఆయన ఆలోచన మేరకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో రోహిత్ వేముల చట్టం తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ రాష్ట్రంలో అధికారంలోకి వస్తాం రాగానే వనరులు సంపద సమానంగా పంచుతామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రకటించారు ఆయన ప్రకటించినట్టుగా అధికారంలోకి రాగానే ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశ స్వాతంత్రం అనంతరం ఎక్కడా జరగని కుల గణనను ప్రజా ప్రభుత్వం 50 రోజుల్లో పూర్తి చేసి శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదం పొందాలని వివరించారు.దేశానికి స్వాతంత్రం సాధించడంతోపాటు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించేందుకు అనేక విప్లవాత్మక చట్టాలు చేసిన కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని తెలిపారు. స్వాతంత్రం ముందు నుంచి




దేశంలోని రుగ్మతల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న కాంగ్రెస్ పార్టీని దేశంలో లేకుండా చేసేందుకు బీజేపీ కాంగ్రెస్ ముక్తభారత్ చేస్తాం, రాజ్యాంగాన్ని మారుస్తాం అంటుంది అన్నారు. ఈ సమాజం సామాజికంగా, ఆర్థికంగా విభజన జరిగి ఇలాగే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయని తెలిపారు. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవం, తాను కుల వివక్షణ ఎదుర్కొన్నానని వివరించారు. ఈ సమాజంలో కుల వివక్ష ఉంటుంది అన్న వాస్తవాన్ని మదిలో పెట్టుకుని బలమైన సంకల్పంతో అనుకున్న లక్ష్య సాధనకు ముందుకు పోతున్న క్రమం లో వివక్ష ఎదురైన అది మన లక్ష్యాలను దెబ్బతీయలేదని వివరించారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఒక రాజకీయ పార్టీగా మాత్రమే కాదు దేశంలో అంటరానితనం, బాల్య వివాహం, వితంతు వివాహం వంటి అనేక రుగ్మతలపై దశాబ్దాలుగా ప్రజలను చైతన్యం చేస్తూ ముందుకు పోతుందని తెలిపారు. దేశ స్వాతంత్ర సంగ్రామం ఒకవైపు, సామాజిక అంశాలపై ఆందోళనలో మరోవైపు ఈ దేశంలో రెండు అంశాలను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లిందని వివరించారు. కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో అంటరానితనం పూర్తిగా నిర్మూలించాలని, దేవాలయాల్లో అందరికీ ప్రవేశం కల్పించాలని ÷ఐ మాధవన్ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేరళలో వైకాం సత్యాగ్రహ, మహారాష్ట్రలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో చౌదర్ సత్యాగ్రహం వంటి కార్యక్రమాలను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ చేపట్టింది అన్నారు. గాంధీజీ ఆధ్వర్యంలో హరిజనోద్ధరణ పేరిట పెద్ద యాత్ర చేపట్టారని దళితుల దేవాలయల ప్రవేశం, దళిత వాడల్లో పారిశుధ్యం వంటి కార్యక్రమాలు ఈ దేశంలో అంటరానితనాన్ని తొలగిస్తారని గాంధీ ఓ నమ్మకాన్ని ఏర్పరిచారని తెలిపారు.స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రధాని నెహ్రూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో దేశంలో అంటరాని తనం నిర్మూలనకు 1049లో ఆర్టికల్ 17 ద్వారా అవకాశం కల్పించారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకురావడం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను పూర్తిగా అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే సాధ్యమైంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయ కరణ ద్వారా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్వాతంత్రం లభించిందని తద్వారా సామాజిక వివక్షను ఎదుర్కొనేందుకు చేయూత లభించిందని డిప్యూటీ సీఎం వివరించారు. సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డాక్టర్ వంశీ చందర్ రెడ్డి, ఏ ఐ సి సి నాయకులు విశ్వనాథన్, సావంత్, సచిన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

(మొదటి పేజి తరువాయి

సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసినా దానికి అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిషన్,కమిటీని ఏర్పాటుచేయాలని ఈ నెల 3వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడాన్ని సవాలుచేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక సిట్ ఏర్పాటుచేసినా దానికి అతీతంగా కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్/కమిటీని ఏర్పాటుచేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. సోమవారం సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను కొట్టివేసింది.తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారంలో ఏక సభ్య కమిటీ ఏర్పాటుపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ అంశంపై సోమవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. శ్రీవారి లడ్డూ వ్యవహారంపై సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇచ్చిన నివేదికపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రాతో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సిట్ నివేదికను పరిశీలించి.. పరిపాలనా లోపాలు, టెండర్ అవకతవకలు, బాధ్యులను గుర్తించడానికే ఈ కమిటీని నియమించినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది ప్రభుత్వం. అలాగే సీబీఐ సిట్ విచారణకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేసింది. దీంతో కమిషన్ ఏర్పాటును సుప్రీం సమర్థించింది.

## అనాథ యువతకు ఉద్యోగాల కల్పన

(మొదటి పేజి తరువాయి

గ్రౌండ్ హ్యాడ్లింగ్ వంటి కోర్సుల్లో దశల వారీగా శిక్షణ ఇవ్వనున్నాయి. శిక్షణ ద్వారా అనాథ యువతకు ప్రైవేట్, అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థల్లో ఉద్యోగాలు కల్పించ నున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని 2026 మార్చి నుంచి శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో అకాడమీలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సదన్‌లో ఉంటున్న అనాథ యువతకు ఉద్యోగ అవకాశాల లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నారు. పాలిటెక్నిక్ చదువుతున్న అనాథ అమ్మాయిలకు ఫిక్కి నిర్వాహకులు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. చదువుకునే కాలంలోనే ఇండస్ట్రీ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ ట్రైనింగ్ శిక్షణ కోసం అజీమ్ ప్రెమ్జి యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. అంగన్వాడీ టీచర్లకు ఇంగ్లిష్‌పై శిక్షణ, పాలన కేంద్రాల్లో చిన్నారులకు అందిచాల్సిన సేవలపై శిక్షణని అజీమ్ ప్రెమ్జి యునివర్సిటీ ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. అనాథ పిల్లల సంరక్షరణ ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు. వారికి కేవలం ఆశ్రయం కాదని, భవిష్యత్తు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పరిశ్రమలతో భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించి వారిని స్వతహాగా ఎదిగేలా తీర్చిదిద్దడం తమ ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించారు. మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి లక్ష్యాలతో రూపొందించిన ఈ కార్యక్రమం ప్రభుత్వం–పరిశ్రమల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పుకొచ్చారు. సమగ్ర పునరావాసం, శిక్షణ, ఉపాధి కల్పనలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్య అనాథ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపే మార్గదర్శక నిర్ణయంగా నిలవనుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## బీహార్‌లో ఐపీఎస్ అధికారిసునీల్ నాయక్ అరెస్ట్

(మొదటి పేజి తరువాయి

ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో వేధించినట్లు నమోదైన 'థర్డ్ డిగ్రీ' కేసులో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ ను బీహార్‌లో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. బీహార్ కేడర్‌కు చెందిన సునీల్ నాయక్.. వైసీపీ హయాంలో డిప్యూటేషన్‌పై సీఐడీలో పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన బీహార్ వెళ్లిపోయారు. రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో సునీల్ పాత్రపై ఫిర్యాదు చేయడంతో విచారణకు రావాలని ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు బిహార్‌లోని పట్నాలో అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బిహార్ రాష్ట్రంలో ఐజీగా విధులు నిర్వహిస్తున్న సునీల్ నాయక్‌ను పట్టుకునేందుకు ఏపీ పోలీసుల బృందం పట్నా వెళ్ళింది. గత కొంతకాలంగా ఈ కేసులో విచారణకు హాజరుకావాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆయన స్పందించకపోవడంతో పోలీసులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సునీల్ నాయక్ ఏపీ సీఐడీలో ఐజీగా డిప్యుటేషన్‌పై పనిచేశారు. 2021లో రాజద్రోహం కేసులో తనను అరెస్టు చేసిన సమయంలో, సీఐడీ కస్టడీలో ఉండగా తనపై సునీల్ నాయక్ నేతృత్వంలో థర్డ్ డిగ్రీ ప్రయోగించారని రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. తన కాళ్లపై తీవ్రంగా కొట్టడం, మానసికంగా వేధించడం వంటి చర్యల్లో సునీల్ నాయక్ కీలక పాత్ర పోషించారని రఘురామ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సునీల్ నాయక్‌ను అదుపులోకి తీసుకున్న వెంటనే ఏపీ పోలీసులు బిహార్ ప్రభుత్వానికి అధికారికంగా సమాచారం అందించారు. పట్నాలోని స్థానిక కోర్టులో ఆయనను హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ కోరారు. కోర్టు అనుమతి లభించడంతో ఇవాళ రాత్రికి ఆయనను విమానంలో లేదా రోడ్డు మార్గంలో గుంటూరుకు తీసుకువచ్చే అవకాశం ఉంది. ఈ అరెస్టుతో ఏపీలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గత ప్రభుత్వ హయాంలో అత్యుత్సాహం ప్రదర్శించిన అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందనే సంకేతాలు ఈ ఘటనతో స్పష్టమవుతున్నాయి. ఈ కేసులో మరికొందరు ఉన్నతాధికారులు కూడా విచారణను ఎదుర్కొనే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

## తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతం

(మొదటి పేజి తరువాయి

పవన్ కల్యాణ్ నిర్ణయించారు.ఈ నేపథ్యంలో తెలంగాణలో పార్టీని 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లి, సంస్థాగతంగా బలోపేతం చేయడానికి జిల్లాలవారీగా కొంతమంది నాయకులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నూతనంగా ఏర్పడిన మూడు కార్పొరేషన్‌లకు వేర్వేరు ఇన్‌ఛార్జులను నియమించారు.జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నాయకులు రాధారాం రాజలింగం, కావ్య మండపాక, శిరీష పొన్నూరి రాష్ట్రస్థాయిలో పర్యవేక్షిస్తారని ఆ ప్రకటనలో జనసేన పార్టీ తెలిపింది. ఆయా పార్లమెంట్ పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాల బాధ్యతను రసువుకు నాయకులకు అప్పగించారు.

## రాజమండ్రిలో పాలకల్తీతో కిడ్నీ ఫెయిల్యూర్

(మొదటి పేజి తరువాయి

మరణించారని తెలుస్తోంది. దీంతో పాలు పోసే వ్యక్తి గాణెళిశ్‌ను అరెస్ట్ చేశారు. పాలను పరీక్షలకు పంపారు. రాజమహేంద్రవరంలోని ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి ఆస్పత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగిన సంగతి తెలిసిందే. లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 15 తర్వాతి నుంచి వాంతులవడం, మూత్రవిసర్జన కాకపోవడం, పొట్ట ఉబ్బడం తదితర సమస్యలతో ఒక్కొక్కరుగా 14 మంది ఆసుపత్రిలో చేరారు. వీరిలో భాగిశెట్టి కనకరత్నం (76), తాడి కృష్ణవేణి (75) ఇప్పటికే మృతిచెందారు. బాధితుల్లో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడినవారే కాగా 5 నెలల శిశువు, మూడేళ్ల బాలుడు కూడా ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనారోగ్యానికి గురవడంతో వారు ఆదివారం అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రుల పాలైన బాధితులందరికీ ఒకే వ్యక్తి పాలు పోస్తుండటంతో అక్కడే కల్తీ జరిగి ఉండొచ్చని వైద్యాధికారులు, బాధితులు పోలీసులకు తెలిపారు. శివరాత్రి రోజు పాలు, పెరుగు చేదుగా అనిపించాయని కొంతమంది బాధితులు చెప్పారు. కోరుకొండ మండలానికి చెందిన గణెళిష్ అనే వ్యాపారి వీరందరికీ పాలు పోస్తున్నట్లు గుర్తించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. బాధితుల నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాలను టాక్సికాలజీ పరీక్షకు పంపించారు. ఆ నమూనాల నివేదికలు రావాల్సి ఉంది.

## హైదరాబాద్ మెట్రోపూర్తిగా ప్రభుత్వ స్వాధీనం

**హైదరాబాద్,ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):**

హైదరాబాద్ మెట్రో రైలుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని మంత్రివర్గం ఈరోజు నిర్ణయించింది. మెట్రో రైలు స్వాధీనంపై ఇదివరకే ప్రభుత్వం ప్రకటన చేసింది. స్వాధీనం చేసుకునే ప్రక్రియను పర్యవేక్షించడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది.ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావులతో ఈ ఉపసంఘాన్ని నియమించింది. గత సంవత్సరం సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో ఎల్ అండ్ టీకి రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా చెల్లించాలని, రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకోవాలని అవగాహనకు వచ్చాయి. నాటి నుంచి స్వాధీన ప్రక్రియ ప్రారంభమైంది.

## జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం

**హైదరాబాద్,ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):**

బీఆర్ఎస్ పూర్తిగా ఫెయిల్ అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన 'రైతు సంఘర్షణ' సభలో ఆమె మాట్లాడుతూ, తనకు జోగులాంబ అమ్మవారు సెంటిమెంట్ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఏ కార్యక్రమం మొదలైనా ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లా నుంచి ఎక్కువగా ప్రారంభమయ్యేదని అన్నారు.కానీ భవిష్యత్తులో మనం ఏర్పాటు చేయబోయే పార్టీ మొదలు అన్నీ జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ప్రారంభం చేయాలని నిర్ణయించుకున్నానని అన్నారు. ఇక్కడి నడిగడ్డ ప్రజలు నిజాయతీపరులని, అలాగే ఈ గడ్డపై నుంచి ఏ కార్యక్రమం ప్రారంభించినా జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని భావిస్తున్నానని అన్నారు. పరిశ్రమలకు కరెంట్ ఇస్తున్నారు కానీ కష్టపడి పనిచేసే రైతులకు ఇవ్వడం లేదని విమర్శించారు. జోగులాంబ అమ్మవారి దయతో గద్వాల జిల్లా నుంచే తెలంగాణ జాగృతి జైత్రయాత్ర ప్రారంభమైందని అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీని తాము గెలుచుకున్నామని వెల్లడించారు. కానీ వడ్డేపల్లిలో తాము గెలిచిన తర్వాత తమ వారిని అధికార పార్టీ వారు దగ్గరకు తీసుకున్నారని మండిపడ్డారు. అసలు గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని సవాల్ చేశారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని వారు ఎమ్మెల్యేగా ఉన్నారని మండిపడ్డారు.సమాధానం చెప్పకుంటే ఎమ్మెల్యే రాజీనామా చేయాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేస్తే ఆ మరుక్షణం తాను ఆ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. రాజకీయాల్లో నీతి, నిజాయతీ, ధైర్యం ఉండాలని వ్యాఖ్యానించారు. మన ప్రాంతం నుంచే నీళ్లు పోతున్నాయి కానీ మనకు మాత్రం అందడం లేదని అన్నారు.నడిగడ్డ ప్రాంతానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేసిందేమీ లేదని అన్నారు.

# కాకతీయ ప్రభుత్వ కళాశాలలో అప్టిట్యూడ్‌రీజనింగ్ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం ప్రారంభం..

**హనుమకొండ : ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ ప్రభుత్వ కళాశాల (ఆటానమస్), హనుమకొండలో ఈ రోజు రెండు రోజుల అప్టిట్యూడ్ మరియు రీజనింగ్ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం ప్రారంభమైంది.లి ఈ కార్యక్రమాన్ని టీఎస్‌కేసీ & ప్లేస్‌మెంట్ సెల్, టాస్క్ సహకారంతో నిర్వహిస్తోంది. పోటీ పరీక్షలు మరియు నియామక ప్రక్రియలకు అవసరమైన గణిత మరియు తార్కిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్‌లి అధ్యక్షత వహించారు. ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అంకగణితం మరియు రీజనింగ్ అంశాలను క్రమంగా నేర్చుకుని నిరంతరం అభ్యాసం చేయాలని సూచించారు. ఈ విభాగాలు పోటీ పరీక్షలు మరియు పీజీ ప్రవేశ పరీక్షల్లో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.డా. ఎ. అనిల్







కుమార్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ & ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌లి , మాట్లాడుతూ అంకగణితం మరియు రీజనింగ్ విభాగాలు మార్కులు మరియు ఎంపికలను నిర్ణయించే ముఖ్యమైన అంశాలని పేర్కొన్నారు. ఎస్‌–ఎస్‌సీ, బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ, యూపీఎస్‌సీ, టీజీపీఎస్‌సీ వంటి ప్రధాన పోటీ పరీక్షలు మరియు పీజీ ప్రవేశ పరీక్షల్లో ఇవి అత్యంత ప్రాధాన్యత కలిగినవని వివరించారు. విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.డా. రాజశేఖర్, డా. శ్రీనాథ్, డా. దినకర్, డా. చిన్నా, డా. శ్రీకాంత్, డా. జి.కె. కుమార్, సాగర్, నవీన్, సునీత, వందన, బాలు, మాధవ్, వినయ్‌లి తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ రెండు రోజుల కార్యక్రమంలో ప్రత్యేక శిక్షణ మరియు అభ్యాస తరగతులు నిర్వహించబడుతున్నాయి.

# కాకతీయ ప్రభుత్వ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో కవిత్వ కార్యశాల విజయవంతం..




**హనుమకొండ : ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాకతీయ ప్రభుత్వ కళాశాల( అటానమస్) లో ఈరోజు తెలుగు విభాగం మరియు హోరు సంయుక్త ఆధ్వర్యంలో కవిత్వ కార్యశాల ఘనంగా నిర్వహించబడింది. ఈనాటి కార్యక్రమానికి ప్రధాన వక్తలుగా పుప్పాల శ్రీరామ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాడేపల్లిగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి సుంకర గోపాల్, ప్రముఖ కథా రచయిత అద్దేపల్లి ప్రభు, విజయవాడ నుండి అనిల్ డ్యాని పాల్గొన్నారు. ఈనాటి సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ పాల్ ప్రొఫెసర్ జి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. అధ్యక్షులు మాట్లాడుతూ యువత కవిత్వం పట్ల అభిరుచిని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. తెలుగు భాషలో అద్భుతమైన కవిత్వ సృష్టి జరిగిందని నన్నయ నుండి శ్రీ శ్రీ వరకూ అద్భుతమైన కవిత సంపద మన తెలుగు భాషలో ఉన్నదని పేర్కొన్నారు. శ్రీ శ్రీ, గురజాడ, కందుకూరి వీరేశలింగం లాంటి



ప్రముఖులు ఆధునిక కవిత్వాన్ని ముందుకు తీసుకెళ్లారని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వక్తలు పుప్పాల శ్రీరామ్ కవిత్వం ఎలా రాయాలి, కవితా వస్తువు ఏ విధంగా ఉండాలి అనే విషయాన్ని విద్యార్థులకు తెలియజేశారు. సుంకర గోపాల్ నేటి ఆధునిక కవిత్వంలో గల కవిత వస్తువులు ఏమిటి, విద్యార్థులు ఎటువంటి కవితవస్తులను ఆశ్రయించి కవిత్వాన్ని వ్రాయాలి, కవితలు ఎలా రాయాలి విషయాన్ని వివరించారు. కుక్కపిల్ల అగ్గిపుల్ల,సబ్బుబిళ్ళ కవితా వస్తువులని శ్రీశ్రీ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. స్పందించే హృదయం ఉంటే ఏ విషయాన్ని అయినా కవిత వస్తువుగా స్వీకరించి కవితలు చెప్పవచ్చని నేటి ఆధునిక కవుల వచన కవితలను విద్యార్థులను ఉల్లాసపరిచే విధంగా వివరించారు. అనిల్ డ్యాని కవిత్వం ఎందుకు రాయాలో అనే విషయాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఈనాటి కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు అనేకమంది తమ స్వీయ అనుభూతులను కవితల రూపంలో వ్రాసి చదివి వినిపించారు. ఈనాటి కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు డా లెంక సత్యనారాయణ, డాక్టర్ సమత, డాక్టర్ జె.రమేష్, డాక్టర్ జీ. మహేందర్, మాలతి, శ్రీనివాస్, డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ నాగమణి, ఎడమ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కోమల, డాక్టర్ శ్రీదేవి, కిరణ్మయి, ప్రదీప్ శ్రావణ్, రాజేందర్, డాక్టర్ శశికాంత్, గాయత్రి, డాక్టర్ గౌరీ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల కారణంగా దేశ భవిష్యత్తైన యువతను కోల్పోతున్నాం







**● వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**

**హనుమకొండ : ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రోడ్డు నిబంధనలు పాటించక పోవడంతో ఎంతో మంది దేశ భవిష్యత్తైన యువతను రోడ్డు ప్రమాదాల్లో కోల్పోతున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ప్రతి నెల చివరి వారం నిర్వహించే " అరైవ్ అలైవ్ " రెండవ విడత కార్యక్రమము లో భాగంగా వరంగల్ ట్రాఫిక్ అధ్వర్యంలో హన్మకొండలోని వాగ్దేవి కళాశాల విధ్యార్థుల కు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ " అరైవ్ అలైవ్ " ఏర్పాటు చేశారు. ముందుగా ఈ కార్యక్రమము లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విధ్యార్థులకు ప్రతి వాహన దారుడు పాటించాల్సిన ట్రాఫిక్ నిబందనలు, వాటిని అతి క్రమిస్తే జరిగే పరిణాలపై ట్రాఫిక్ అధికారులు విద్యార్థులకు వివరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గోన్న వరంగల్ పోలీస్ కమిషనర్ విధ్యార్థులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ ప్రతి వాహన దారుడు వాహనం నడిపేటప్పుడు తగు జాగ్రత్తలను తీసుకుంటూ వాహనం నడపాలని, ఇదే వాహనదారుడు తన ప్రాణాన్ని కాపాడుకుంటూ ఇతరుల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత వాహనదారుడిపై వుందని వాహనదారుడు నిబంధనలు పాటించకుండా వాహనాలు నడపటం ద్వారా ప్రమాదాలకు గురైయ్యే అవకాశాలు ఎక్కువని, తన థ్రిల్ కోసం వాహనదారుడు వాహనం నడపటం చాలా ప్రమాదకమని, కొన్ని సందర్బాల్లో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని. ఇలాంటి చర్యల కారణంగా కుటుంబ సభ్యులు ఎంతో నష్టాపోతారని, కావున ప్రతి వాహనదారుడు తన ప్రాణాన్ని కాపాడుకుంటూ డిఫెన్సీ డ్రైవింగ్ చేయాలని సిపి విద్యార్థులకు సూచించారు. గత సంవత్సరంలో హత్యలు లేదా ఇతర కారణాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఏనిమిది వందల మంది మరణించారు. కాని రోడ్డు ప్రమాదాల కారణంగా గతే ఏడాది 7,500 మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడటం చాలా బాధకరమని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనం నడపాల్సిందిగా తెలియజేయాలని పోలీస్ కమిషనర్ విద్యార్థులకు సూచించారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్ పాటిస్తామంటూ విద్యార్థుల చేత ట్రాఫిక్ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమములో సెంట్రల్ డిసిపి దార కవిత, ట్రాఫిక్ అదనపు డిసిపి ప్రభాకర్ రావు, ఏసిపి సత్యనారయణ, ఇన్స్‌స్పెక్టర్లు వెంకన్న, సీతరెడ్డి, సుజాత, వాగ్దేవి కళాశాల ప్రిన్స్‌పాల్ శేషాచలం, కరస్పాడెంట్ శ్రవణ్ రెడ్డి హరిచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

# టిజి ఈడీ సెట్ 2026 నోటిఫికేషన్ విడుదల

**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 16 సెంటర్లలో పరీక్ష కేంద్రాలు**

**ఏప్రిల్ 15 చివరి తేదీ కేయూ వైస్ చాన్సలర్ ప్రతాప్ రెడ్డి**

**హనుమకొండ : ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా టిజి ఈడీ సెట్ 2026 నిర్వహిస్తున్నట్లు కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రతాపరెడ్డి తెలిపారు. మీడియా సమావేశంలో టిజి ఈడీ సెట్ 2026 నోటిఫికేషన్ విడుదల చేసి తేదీలను ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అర్హత కలిగిన విద్యార్థులు తమ దరఖాస్తులను ఫిబ్రవరి 23నుండి ఆన్ లైన్ అప్లికేషన్ లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు ఎస్సీ ఎస్టీ దివ్యాంగులకు దివ్యాంగుల విద్యార్థులకు₹




550 ఫీజు, బిసి,ఓసీలకు ₹750 గా ఫీజు చెల్లించాలని ఏప్రిల్ 15 చివరి తేదీగా పేర్కొన్నారు. ఏప్రిల్ 22 నుండి అదనపు రుసుము ₹250, ఏప్రిల్ 27నుండి 500రూపాయల తో అదనపు రుసుము,ఏప్రిల్ 30 నుండి 1000రూపాయలు అదనపు రుసుముతో ఫీజు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆన్ లైన్ నమోదులో తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి అవకాశం మే 2 తేదీ గా అవకాశం ఇస్తున్నట్లు, చివరి నిమిషంలో విద్యార్థులు ఆన్ లైన్ లో నమోదు చేయాలనుకునే విద్యార్థులకు మే 8 తేదీ నుండి 9వ తేదీ లోపు 5000 రూపాయల అపరాధ రుసుముతో అప్లయ్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం మే 4తేదీ న పరీక్ష కేంద్రాల నిర్ధారణ విడుదల చేయనున్నట్లు మే 9వ తేదీన హల్ టిక్కెట్లు డౌన్ లోడ్ చేసుకునే అవకాశం వెబ్ సైట్ నుండి డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 16సెంటర్లలో పరీక్ష కేంద్రాలు పరీక్ష నిర్వహణ నిర్వహించనున్నట్లు, మే 12వ తేదీన ఉదయం నుండి 10నుండి 12గంటల వరకు, రెండోవ సెక్షన్ లో మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు , పరీక్ష పరీక్షలు నిర్వహించబడతాయని వీటికి సంబంధించిన పరీక్ష కీ మే 15వ తేదీన విడుదల చేయనున్నట్లు తెలిపారు.

# కామారెడ్డి ఘటనపై తీవ్ర విమర్శలు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై డా. జాడి రామరాజు ఆరోపణలు

**● బీజేపీ నేతలపై అక్రమ కేసులు, అరెస్టులు ప్రజాస్వామ్యానికి విరుద్ధం**



**ఏటూరునాగారం, ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** సోమవారంములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా. జాడి రామరాజు నేత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి నివాసంపై జరిగిన దాడి ఘటనను ఖండిస్తూ, ఆ సంఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బదులు, బీజేపీ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేయడం అన్యాయమని ఆరోపించారు.అదేవిధంగా, ఎమ్మెల్యేను పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ప్రభుత్వం తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని, రాజకీయ కక్ష సాధింపుగా ఈ చర్యలు చేపడుతోందని తెలిపారు.

# శ్రీ బోయకొండ గంగమ్మకు హుండీ ఆదాయం రూ.59.35లక్షలు



**అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఫిబ్రవరి 23 (ఆంధ్ర ప్రదేశ్: పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** శక్తి క్షేత్రం శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం నందు హుండీ ద్వారా రూ.59,35,839 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మరియు ఉపకమిషనర్ ఏకాంబరం తెలిపారు. సోమవారం కొండపై జరిగిన హుండీ లెక్కింపులో 45 రోజులకు గాను నగదుతో పాటు 38 గ్రాముల బంగారం,155 గ్రాముల వెండి భక్తులు అమ్మవారికి కానుకూల రూపంలో సమర్పించారన్నారు . అదేవిధంగా రణభేరి గంగమ్మ ఆలయంలో గల హుండీ ద్వారా రూ 34,024లు, అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ 13,495లు ఆలయానికి ఆదాయంగా సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ,దేవస్థానం అర్చకులు, బ్యాంకు మేనేజర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# సిఎం కప్ వెయిట్ లిఫ్టింగ్‌లో మహబూబాబాద్ జిల్లాకు బంగారు పతకం



**మహబూబాబాద్, ప్రతినిధి ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):**జిల్లా క్రీడా చరిత్రలో మరో స్వర్ణాక్షర అధ్యాయం నమోదైంది. ఫిబ్రవరి 22, 23 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సిఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన యువ క్రీడాకారిణి ఎం. స్వాతి అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది.58 కిలోల విభాగంలో పోటీ పడిన స్వాతి తన శక్తి, నైపుణ్యం, ఆత్మవిశ్వాసంతో ప్రత్యర్థులను వెనక్కు నెట్టి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రతి లిఫ్ట్‌లోనూ సమతుల్యత, పట్టుదల, క్రమశిక్షణతో ప్రదర్శన ఇచ్చి న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకుంది.బయ్యారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన స్వాతి చిన్నప్పటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుని కఠిన సాధనతో ఈ స్థాయికి చేరుకుంది. గతంలోనూ పలు రాష్ట్ర, జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని మెడల్స్ సాధిస్తూ తన ప్రతిభను చాటుకుంది. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఆమె సాధించిన ఈ విజయం జిల్లా యువతకు ప్రేరణగా నిలుస్తోంది.ఆమె విజయంపై తెలంగాణ స్టేట్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. శృతి ,మహబూబాబాద్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మండలోజు సుధాకర్, కార్యదర్శి కొత్త రాంబాబు హర్షం వ్యక్తం చేస్తూ స్వాతిని ప్రత్యేకంగా అభినందించారు. క్రమశిక్షణ, నిరంతర సాధనతో ముందుకు సాగితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా పతకాలు సాధించే సామర్థ్యం ఆమెకు ఉందని వారు పేర్కొన్నారు.స్వాతి సాధించిన ఈ బంగారు పతకం మహబూబాబాద్ జిల్లాకు గర్వకారణంగా మారింది. జిల్లా క్రీడా వర్గాలు, కోచ్‌లు, కుటుంబ సభ్యులు ఆమెకు అభినందనలు తెలుపుతున్నారు. ఆమె విజయంతో జిల్లాలో వెయిట్ లిఫ్టింగ్‌కు మరింత ప్రోత్సాహం లభించనుంది.మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఈ యువ క్రీడాకారిణి భవిష్యత్తులో మరిన్ని శిఖరాలు అధిరోహించాలని జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# హోలీ సందడి మొదలు ఏటూరునాగారంలో జాజిరి ఆటలతో అల్లరిచేస్తున్న చిన్నారులు

**● వీధులన్నీ పిల్లల కేరింతలతో కళకళ**



**ములుగు జిల్లా, ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):**ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో హోలీ పండుగ సమీపిస్తున్న వేళ చిన్నారుల సందడి మొదలైంది. జాజిరి ఆటలతో పిల్లలు అల్లరిగా ఆడుకుంటూ వీధుల్లో హుషారుగా తిరుగుతున్నారు.సాయంత్రం వేళ ప్రధాన రోడ్లపై పిల్లలు జాజిరి బాటిళ్లతో పరస్పరం నీటిని చల్లుకుంటూ, సరదా చేష్టలతో పండుగ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. వారి కేరింతలు, నవ్వులతో పరిసర ప్రాంతాలు ఉల్లాసంగా మారాయి.ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా హోలీ దగ్గర పడుతుండటంతో పిల్లలు ముందుగానే సంబరాలకు శ్రీకారం చుట్టారు. మిత్రులతో కలిసి ఆటపాటలతో కాలక్షేపం చేస్తూ పండుగ ఆనందాన్ని ఆస్వాదిస్తున్నారు.ఈ దృశ్యాలు స్థానికులను ఆకట్టుకుంటున్నప్పటికీ, రోడ్లపై ఆటలు ఆడేటప్పుడు వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు పాటించాలని పెద్దలు సూచిస్తున్నారు.హోలీ పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని పిల్లలతో పాటు తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

## బిఆర్ఎస్ సీనియర్ నాయకుని కుటుంబ సభ్యులు పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



**గంగాధర ఫిబ్రవరి 23(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంబోయిన్పల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం తిరుపతి రెడ్డి గారి తండ్రి గడ్డం మల్లారెడ్డి ఈరోజు ఉదయం అనారోగ్యంతో మృతి చెందగా మాజీ సుంకె రవిశంకర్ హాజరై మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మృతుడి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఆయన వెంట సర్పంచ్ జంపుక మాధవి ఆనంద్, ఉప సర్పంచ్ స్వామి రెడ్డి, మాజీ మండల కో-ఆప్షన్, మెంబర్ మహ్మద్ ఆజ్జూ, నాయకులు సుజన్ రెడ్డి, కమల్ గౌడ్ ఉన్నారు.

## పెగడపల్లి గ్రామ అభివృద్ధే లక్ష్యం సర్పంచ్ స్పష్టం

- గ్రామ సమస్యల పరిష్కారానికి వార్డు వారీగా కార్యాచరణ




**ములుగు జిల్లా, ఫిబ్రవరి 23(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు మండలం, పెగడపల్లి: పెగడపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని గ్రామ సర్పంచ్ స్పష్టం చేశారు. ఈ దిశగా గతంతో పోలిస్తే ఈసారి గ్రామంలో కాలువలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, శానిటేషన్, తాగునీటి సరఫరా, గ్రామ పంచాయతీ భవనం, వీఓ భవనం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. సోమవారం పెగడపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన బాడీ మీటింగ్‌లో గ్రామాభివృద్ధిపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సమావేశంలో ఉప సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ గ్రామస్తులను కోరారు. ప్రతి వార్డుకు సంబంధించి వార్డు నెంబర్లను స్పష్టంగా ప్రకటించి, సమస్యలను వార్డు సభ్యుల ద్వారా లేదా నేరుగా తెలియజేయాలని సూచించారు.

# పసికందు ప్రాణం తీసిన కుల వివక్ష

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష

**పెద్దపల్లి, ఫిబ్రవరి 23:(పిసిడబ్ల్యూన్యూస్):** నాగర్‌కర్నూల్ జిల్లా కొమ్మర గ్రామంలో అగ్రవర్ణాల అహంకారానికి ఒక రజక కుటుంబానికి చెందిన రెండేళ్ల పసికందు బలికావడం అత్యంత హేయమైన చర్య అని, దీనిని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష తీవ్రంగా ఖండించారు. బాధిత కుంటుబానికి మద్దతుగా సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ కేవలం వంద రూపాయల టికెట్ కొనలేమని చెప్పినందుకు స్థానిక కాంగ్రెస్ సర్పంచ్ మరియు మరికొందరు అగ్రవర్ణ వ్యక్తులు ఒక బీసీ కుటుంబంపై కులం పేరుతో దూషిస్తూ దాడికి తెగబడ్డారని, ఈ క్రమంలో ఒక



మహిళ బట్టలు చింపివేయడమే కాకుండా రెండేళ్ల చిన్నారిని కాళ్లతో తొక్కడం వల్ల ఆ పసికందు ప్రాణాలు కోల్పోవడం గుండె తరుక్కుపోయేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి ఘోరం జరిగినా పోలీసులు బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, పసిబిడ్డను కోల్పోయిన తల్లిదండ్రులపైనే అక్రమ కేసులు నమోదు చేయడం మరియు నిందితులపై ఇప్పటివరకు కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకపోవడం పోలీసుల పక్షపాత



వైఖరికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు. తక్షణమే నిందితులపై హత్య కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేయాలని, నిందితులకు కొమ్ముకాస్తున్న పోలీసు అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ ఘటనపై హైకోర్టు జోక్యం చేసుకుని జుడిషియల్ విచారణ జరిపించాలని, బాధితులకు న్యాయం జరగని పక్షంలో ప్రతి గ్రామం మరియు జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని ఉష హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో రజక సంఘం నాయకులు బొడ్డుపల్లి లక్ష్మణ్, బొడ్డుపల్లి రామ్మూర్తి, బీసీ జేఏసీ నాయకులు నల్లవెల్లి శంకర్, కొండిసతీష్, అలువాల రాజేందర్, బీసీ జేఏసీ మహిళ అధ్యక్షురాలు సిరవైన స్వప్న, కొమరయ్య, రవి, సాగర్, రాహుల్, రవి, శ్రీను, శ్రావణ్, శ్రీనివాస్, ఆముదాల అరుణ, భాస్కర్ పాల్గొన్నారు.

# తురకకాశ ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందించాలి

**పాలకులు మారిన తురకకాశ ముస్లింల బ్రతుకు మారడం లేదు**

**సుత్తే, శానంతో వాళ్లు ఇంకెన్నాళ్లు జీవనం గడపాలి**

**ప్రభుత్వం అందించే టూల్ కిట్స్ వాళ్ల బ్రతుకులు మార్చలేవు**

**కంప్రెషర్లు, ట్రాక్టర్లు, గూడ్స్ వాహనాలు సబ్సిడీపై అందించి వారిని ఆదుకోవాలి**

**జమియతుల్ ఉలేమా జిల్లా ఉపాధ్యక్షుడు ముఫ్తి ఫియాస్ మొహియుద్దీన్ డిమాండ్**

**కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 23(పిసిడబ్ల్యూ న్యూస్):** దశాబ్దాలు గడుస్తున్నా, తెలంగాణ రాష్ట్రంలో పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా.. సంచార జీవులుగా పరిగణించబడే తురక కాశ ముస్లింల జీవన ప్రమాణాలు మాత్రం మారడం లేదని, ప్రభుత్వం అందించే వెయ్యి రూపాయల టూల్ కిట్, వారి జీవితాలను ఏమాత్రం మార్చబోదని జమీయతుల్ ఉల్లేమా జిల్లా ఉపాధ్యక్షుడు ముఫ్తి ఫియాస్ మొహియుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలలోని చేతివృత్తులకు అందిస్తున్న పథకాలను సంచార జీవులుగా ఉన్న ఈ తురక కాశ ముస్లింలకు వర్తింపజేయాలని కంప్రెషర్లు ట్రాక్టర్లు సబ్సిడీపై మినీ గూడ్స్ వాహనాలను అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. సుత్తి శానం వంటి టూల్ కిట్స్ ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటూందని ఆరోపించారు.



సబ్సిడీపై ఇచ్చే స్కూటీలతో వారికి ఏమాత్రం లాభం జరగదని చెప్పారు. గడచిన 25 సంవత్సరాలుగా తమ సంస్థ తరఫున తాను, ముస్లిం జేఏసీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబూబకర్ ఖాలీద్ కలిసి తురక కాశ ముస్లింల జీవన ప్రమాణాలను మార్చేందుకు అలుపెరగకుండా కృషి చేస్తున్నామన్నారు. తురక కాశ ముస్లిం యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఉన్నత విద్య చదువులను ప్రోత్సహించి, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా డ్రైవింగ్, హోటల్ మేనేజ్మెంట్ వంటి కోర్సులను చదివే విధంగా ప్రోత్సహించామ న్నారు. వృత్తివిద్య కోర్సులతోపాటు ఇస్లామిక్ విద్యను సైతం అందించడంలో గత 25 సంవత్సరాలుగా తాము విశేషంగా కృషి చేసినట్లు చెప్పారు. విద్యకు దూరమై, బండ కొడుతూ, రెక్కల కష్టాన్ని నమ్ముకొని జీవిస్తున్న తురక ముస్లింలను సంచార జీవులుగా రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని, దళిత, గిరిజనుల మాదిరిగా వీరికి కాంప్రెషర్లు ట్రాక్టర్లు మినీ గూడ్స్ వాహనాలు సబ్సిడీపై అందించాలని కోరారు. అప్పుడే వీరి జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులు మెరుగవుతాయన్నారు. ప్రభుత్వాలు మారుతున్న తురకకాశ ముస్లింలను పాలకులు పట్టించుకోవడంలో, వీరి కాలనీలను మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయడంలో వీరికి పూర్తిస్థాయిలో విద్యను అందించడంలో, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టూల్ కిట్స్ వంటి పథకాలను మార్చి, సబ్సిడీపై గూడ్స్ వాహనాలు అందించే పథకాలను ప్రవేశ పెట్టే విధంగా ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

# 400 ఏండ్ల వేములవాడ దర్గాను కూల్చివేయడం హేయమైన చర్య

**వక్ఫ్ బోర్డు చైర్మన్ సొంత జిల్లాలో దర్గా తొలగించిన స్పందించకపోవడం అమానుషం**

**కూల్చివేసిన చోటనే దర్గాను తిరిగి పునర్నిర్మాణం చేపట్టాలి**

**దర్గా కూల్చివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోండి**

**పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన ఎంపీజే జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్**

**కరీంనగర్ జిల్లా ఫిబ్రవరి 23(పిసిడబ్ల్యూ న్యూస్):** హిందూ ముస్లింల ఐక్యతకు చిహ్నమైన 400 సంవత్సరాల చరిత్ర కలిగిన వేములవాడ ఆలయంలోని దర్గాను రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేసి హిందూ ముస్లింల మనోభావాలను దెబ్బతీసిందని కూల్చి వేసిన చోట దర్గాను తిరిగి పునర్ నిర్మాణం చేపట్టాలని ఎంపీజే కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్ డిమాండ్ చేశారు. దర్గా కూల్చివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకు వినతి పత్రం అందజేశారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ సొంత జిల్లాలో చరిత్ర కలిగిన దర్గాను కూల్చివేసి తొలగించడంపై, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఇప్పటికీ స్పందించకపోవడం సరికాదన్నారు. దర్గాను కూల్చివేసి తొలగించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్నో మసీదులు దర్గాలు కూల్చివేతకు గురవడం అన్యాయమన్నారు. గడచిన బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇలాంటి ఘటనలు ఎక్కడ జరగలేదన్నారు. భిన్నత్వంలో ఐక్యతను సూచించే "గంగా-జమున తెహజీబ్" కోసం భారతదేశం చాలా కాలంగా గుర్తింపు పొందిందని, విభిన్న విశ్వాసాల ప్రజలు పరస్పర సోదరభావంతో కలిసి జీవిస్తున్నారన్నారు. వేములవాడలోని ఆలయం, దర్గా మధ్య ఉన్న దీర్ఘకాల అనుబంధం హిందూ-ముస్లిం ఐక్యత, శాంతియుత సహజీవనానికి ఉదాహరణగా పేర్కొన్నారు. కొన్ని రాజ్యాంగేతర శక్తులు, దురుద్దేశాలతో వ్యవహరిస్తూ, శాంతియుత వాతావరణాన్ని భంగపరచడానికి, హిందూ ముస్లింల మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. దర్గా కూల్చి






వేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కూల్చివేసిన దర్గా స్థానంలోనే తిరిగి పునర్నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల ఎస్పీని కలిసి సైతం వినతి పత్రం అందిస్తామన్నారు. ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎంపీజే నాయకులు వసీముద్దీన్ అహ్మద్, ఇంతియాజ్ తదితరులు ఉన్నారు.

# సంఘక్షేమాభివృద్ధి క్రైస్తవ సమాజ బలోపేతమే లక్ష్యం

- క్రైస్తవ సంఘాల క్షేమం కోసం ఎఐసిసి పర్యటనలు వేగవంతం
- రన్ ఫర్ జీసస్‌తో సంఘ ఐక్యతకు నాంది
- మండలాల వారీగా సమీక్షలు... యూనియన్ బలోపేతంపై దృష్టి
- ఈస్టర్ ముందు మహా కార్యక్రమాలకు ఎఐసిసి సిద్ధం

**కల్లూరు, ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** క్రైస్తవ సంఘాల క్షేమాభివృద్ధి, సమాజ బలోపేతమే లక్ష్యంగా అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ (ఎఐసిసి) కట్టుబడి పనిచేస్తుందని నియోజకవర్గ అధ్యక్షులు రెవరెండ్ పగడం దాస్ తెలిపారు. ఏఐసిసి రాష్ట్ర అధ్యక్షులు ఏనోశ్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు, తల్లాడ మండలాల్లో కమిటీ పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులను కలుసుకుని సంఘ క్షేమాభివృద్ధి, క్రైస్తవ సమాజ సమస్యలు, యూనియన్ బలోపేతం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు వెల్లడించారు. మండలాల్లో సేవకుల సహవాస సదస్సులు నిర్వహించడం, స్థానిక





సమస్యలను సమీక్షించడం జరిగినట్లు తెలిపారు. రానున్న ఈస్టర్ పండుగకు ముందు రోజు రన్ ఫర్ జీసస్ యేసు కొరకు పరిగెత్తుట




అనే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సంకల్పంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా కల్లూరు టీజిఎం ప్రేయర్ టవర్‌లో రాష్ట్ర అధ్యక్షుల సూచనల మేరకు త్వరలో నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దాసరి నతానియల్, కన్వీనర్ మన్నేపల్లి కెనడి రాజు ఐదు మండలాలు కలయ తిరిగారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల అధ్యక్షుడు తేళ్ల ఎబినేజర్, పెనుబల్లి అధ్యక్షుడు కోట దేవదానం, వేంసూరు అధ్యక్షుడు మోదుగు ఓనేసిమ్, సత్తుపల్లి అధ్యక్షుడు ఖమ్మంపాటి రవి, తల్లాడ అధ్యక్షుడు గుర్రాల కరుణాకర్, పైలా దానియల్, మంచాల యేసుదాసు తదితరులు పాల్గొన్నారు.



# మీడియా ప్రజల గొంతుకగా నిలవాలి: డాక్టర్. వ్యాసభట్ శ్రీవాణి చౌదరి

**● తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరంఫౌండర్, చైర్ పర్సన్ ● ఉప్పల్ మీడియా క్లబ్( ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్) నూతన కమిటీకి ఘన సన్మానం**





**ఉప్పల్ ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిక్ ఫోరం ఫౌండర్, చైర్ పర్సన్ డాక్టర్. వ్యాసభట్ శ్రీవాణి చౌదరి ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్. వ్యాసభట్ శ్రీవాణి చౌదరి మాట్లాడుతూసమాజంలో ప్రజలకు నిజమైన సమాచారం చేరవేయడంలో మీడియా పాత్ర అత్యంత కీలకం ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువచ్చి, ప్రజల గొంతుకగా నిలబడాల్సిన బాధ్యత మీడియాపై ఉంది. ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన కమిటీ సభ్యులు సామాజిక బాధ్యతతో, ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడంలో మీడియా సహకారం చాలా అవసరం. ఉప్పల్ ప్రాంత అభివృద్ధికి సంబంధించి మీడియా ప్రతినిధులు ఎల్లప్పుడూ నిర్మాణాత్మకంగా సహకరించాలని కోరుకుంటున్నాను. ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ చేసే మంచి కార్యక్రమాలకు నా పూర్తి మద్దతు ఎప్పుడూ ఉంటుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

# అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తాం

**● ఏపిడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ హామీ**





**ఆంధ్రప్రదేశ్: చిత్తూరు:చిత్తూరు ఫిబ్రవరి 23 : (పీసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేస్తామని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హామీ ఇచ్చారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( ఏపీడబ్ల్యూజేఎఫ్ ) డైరీ – 2026 ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన అన్నారు. కేబుల్ టీవీలు, చిన్న, వార, పక్ష, మాస పత్రికలకు ప్రభుత్వ జీవో ప్రకారం అక్రిడిటేషన్లను జారీ చేయడంలో తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. పోలీస్ కేసుల విషయంగా ఎఫ్ఐఆర్ నే ప్రామాణికంగా తీసుకోకుండా కేసు తీవ్రతను బట్టి అక్రిడిటేషన్ల మంజూరు విషయంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ క్రమంలో అక్రిడిటేషన్ జారీలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు కవరకుంట్ల జయరాజ్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. చివరగా జిల్లా కలెక్టర్ కు ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు, సభ్యులు, ఆయా పత్రికల ప్రతినిధులు, సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు సాటి గంగాధర్, బి జగదీష్, గందోడి హరిప్రసాద్, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. ప్రకాష్, చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు కేశవులు,ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు, సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మహిళల ఉపాధి దెబ్బతీస్తున్న విబిజిరాంజీ పథకం

**- మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సభలు, ప్రదర్శనలు**

**- పిఓడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి శిరోమణి పిలుపు**



**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) జిల్లా కమిటీ సమావేశం సోమవారం ఖమ్మం నగరంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు జి. లలిత అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పిఓడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. శిరోమణి మాట్లాడుతూ.. మహిళల ఉపాధిని తీవ్రంగా దెబ్బతీస్తున్న వికసిత్ భారత్‌జి రాంజీ (విబిజిరాంజీ) పథకాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా కొత్త పథకాలను ప్రవేశపెడుతోందని ఆమె విమర్శించారు. విబిజిరాంజీ పథకం కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండగా, గ్రామీణ మహిళలు, మహిళా కర్షకులు, పేదల శ్రమను దోపిడీ చేసే విధంగా రూపొందించబడిందని ఆరోపించారు. గ్రామీణ మహిళలకు చట్టబద్ధంగా ఉన్న ఉపాధి హక్కును తొలగించి, పెట్టుబడిదారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పరిస్థితిని ఈ పథకం సృష్టిస్తోందని ఆమె అన్నారు. మహిళలు ఉపాధిగా భావించే పనులను కూడా కుదించడంతో, పెద్ద ఎత్తున మహిళలు పనిలేక ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు గ్రామ గ్రామాన జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి, మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఖమ్మంలో భారీ సదస్సు, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆలోచించి ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగిస్తూ, విబిజిరాంజీ పథకాన్ని రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభ, జిల్లా ఉపాధ్యక్షురాలు తుడుం ఝాన్సీ, జిల్లా నాయకులు సరోజినీ, లలిత, స్వాతి, ప్రమీల, సత్యవతి తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# ఖమ్మం నగరాన్ని విషాదంలో ముంచెత్తిన కోనేటి లక్ష్మయ్య మృతి





**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ గ్రానైట్ వ్యాపారవేత్త కోనేటి నారాయణ తండ్రి కోనేటి లక్ష్మయ్య ఆదివారం రాత్రి పరమపదించడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. కుటుంబానికి మార్గదర్శకుడిగా, సమాజంలో గౌరవనీయుడిగా నిలిచిన లక్ష్మయ్య మరణవార్త తెలిసిన వెంటనే రాజకీయ, సామాజిక వర్గాలకు చెందిన ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన సంతాప సందేశంలో లక్ష్మయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ కూడా లక్ష్మయ్య మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ఖమ్మం బోనకల్ రోడ్డులోని శ్రీరామ్ హిల్స్ నివాసంలో ఆకుల గాంధీతో పాటు బొమ్మిశెట్టి సత్యనారాయణ, ఆకుతోట రాజశేఖర్, పాల్వంచ ధర్మనాయుడు, బొమ్మిశెట్టి ఉపేందర్, జయప్రకాష్, ఆవుల రామానాయుడు, ఆకుల సురేష్ తదితరులు లక్ష్మయ్య పార్థివదేహాన్ని సందర్శించి పూలదండలు సమర్పించి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా స్వర్గీయ లక్ష్మయ్య కుమారుడు కోనేటి నారాయణ మరియు కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. లక్ష్మయ్య సేవలు, సౌమ్య స్వభావం, సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు స్మరించారు. లక్ష్మయ్య మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఖమ్మం నగరంలో ఆయన మృతి ఒక అపూర్వ లోటుగా భావిస్తున్నారు.

# దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టకు వైభవంగా నిర్మితమైన దేవాలయం

**కొలువుదీరనున్న శ్రీ శ్రీ శ్రీ గోవిందమాంబ పోతులూరివీర బ్రహ్మేంద్రస్వామి**

**శ్రీ.గణపతి. శ్రీ.సాయిబాబా.శ్రీ శివ లింగ నందే శ్వరులప్రతిష్టాపన**





**ఖమ్మం, ప్రతినిధి ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం ఏదులాపురం మున్సిపాలిటీ వెంకటగిరి ప్రాంతం వెంకటగిరి ఎక్స్ రోడ్డు నుండి ముదిగొండ రోడ్డు మార్గంలో నిరమితమై ఉన్న దేవాలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట ధ్వజస్తంభ మహోత్సవ కార్యక్రమాలునిర్వహించబడుచున్నవి. ఫిబ్రవరి 23.24.25. తేదీలలో. సోమ మంగళ బుధ వారము ల నందు జరుగు సున్నవి పురోహితులుశ్రీ.గండికోట వెంకటరమణాచార్యులు. పర్యవేక్షణలోవిశ్వకర్మాగమ. శాస్త్రానుసారముగా త్రయాహ్నిక దీక్షతో అవగా ఫిబ్రవరి 23, 24, 25 తేదీలలో సోమ, మంగళ, బుధ వారములందు దేవత. మూర్తులవిగ్రహ. ప్రతిష్ట. ధ్వజస్తంభ .మహోత్సన .కార్యక్రమాలు నిర్వహించబడుతునందున. భక్తమహాశయులందరూ కుల, మత, వర్ణ, వర్గ విభేదములు లేకుండా పూజ, యజ్ఞ మహోత్సవములలో పాల్గొని తమ వంతుగా సహాయ సహకారములు అందించి దేవతామూర్తుల దివ్య ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదములు స్వీకరించి తరించవలసినదిగా మనవి. కార్యక్రమ వివరములు 1.23-02-2026. ఉదయం గం॥ 7-05 నిలకు. ఉదయం 9-00 గంవ నుండి. యాగశాల తోరణముల మృత్సంగ్రహణము, తీర్థనయనం, గోపూజ. దంపతులచే. శ్రీమహాగణాధిపతిపూజ, పుణ్యాహవాచనము, దీక్షా కంకణ ధారణ, పంచగవ్యప్రాశన, ఋత్విక్. వరణలు, మాతృకాపూజ యాగశాల చతుద్వారపూజ ప్రవేశం ప్రధాన కలశస్థాపన, అఖండ దీపస్థాపన సర్వతోభద్రమండల దేవతాసహిత మూర్తి దేవతా ఆవాహనాలు, అగ్ని ప్రతిష్ఠగణపతిహోమం.. సర్వదేవతాహోమము, మూర్తిహోమములు: మధ్యాహ్నం. 12-00 గంటలకు మహానివేదన, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ. సాయంత్రం గంవ 4-05 నిలకు జంబములకు జలాధివాసం (సహస్రఘట జలధారాభిషేకములు)సాయంత్రం గం 6-30 నివలకు అంకురార్పణ, నవగ్రహ మండల యోగినీ మండల క్షేత్రపాలక. మండల, వాస్తుమండలశ్రీ.. వీరబ్రహ్మేంద్రస్వామి మండల ఆవాహనాలు: వేదికా మండల హోమములు, విశ్వకర్మ సూక్త,శ్రీసూక్త, .పురుషసూక్త. సహిత మూర్తి. హోమములు. తీర్థప్రసాద వితరణ యాగశాల బలిహరణలు గుడి ప్రాంగణంలో జరుగు కార్యక్రమాలు. 23.2.2026. ఉదయం. 7.గంటల5. నిమిషాలకు ఉదయం9 9 గంటల నుండి యాగశాల త్వారణముల. మహోత్సవ గ్రహణము. తీర్థనాయనం. గోపూజ దంపతులచే శ్రీ మహాగణపతి పూజ పుణ్య వాహచనము దీక్ష కంకణ ధారణ పంచ పంచాంగ ప్రవచనం ఋతిక్ వరణములు మాతృ పూజ యాగశాల శతు ద్వారా పూజ ప్రవేశం ప్రధాన కలశ స్థాపన అఖండ దీపా స్థాపన సర్వతో భద్ర మండల దేవత సహిత మూర్తి దేవత అవహనాలు అగ్ని ప్రతిష్ట గణపతి హోమం సర్వ దేవత హోమం మూర్తి. హోమములు మధ్యాహ్నం 12 గంటలకు మహా నివేదన. (నారాయణ సేవ ) తదనంతరం శ్రీశ్రీశ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి శాంతి కళ్యాణ మహోత్సవం అధిక సంఖ్యలో భక్తులుపాల్గొని స్వామి వార్ల అమ్మవార్ల కృపకు పాత్రులు కాగలరు ఇట్లు ఆహ్వాన కమిటీ వెంకటగిరి గ్రామం ఏదులాపురం మున్సిపాలిటీ.. దేవాలయ కమిటీ సభ్యులు. cll .9951163366. .9989605979..9441050294... అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించబడును

# రఘునాథపాలెం మండలం దొనబండ గ్రామంలో ఉపాధి హామీ పనులకు ఘన ప్రారంభం




**రఘునాథపాలెం, ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండలం పరిధిలోని దొనబండ గ్రామంలో ఉపాధి హామీ పనులకు శుభారంభం పలికారు. గ్రామ సర్పంచ్ తేజావత్ నవీన్ కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. గ్రామాభివృద్ధి దిశగా మరో ముందడుగు వేస్తూ చేపట్టిన ఈ పనులు గ్రామ ప్రజలకు ఉపాధి అవకాశాలను కల్పించనున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి, ముఖ్యంగా చెరువుల పునరుద్ధరణ, కాలువల శుభ్రపరచడం, రహదారి మరమ్మతులు వంటి పనులు ప్రాధాన్యంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలోని కూలీలకు నిరంతర ఉపాధి కల్పించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకన్న, కృష్ణ, బోడ వెంకన్న మరియు గ్రామ పెద్దలు, మహిళలు, ఉపాధి హామీ కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

# ప్రజావాణి వినతులను పరిష్కరించాలి: హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి



**హన్మకొండ, ఫిబ్రవరి23(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన వినతులను అధికారులు పరిష్కరించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, ఇతర అధికారులతో కలిసి వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు 165 వినతులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారాన్ని పి ఐ ఓ లు ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టానికి సంబంధించిన దరఖాస్తులు కూడా పెండింగ్ లో ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులను పబ్లిక్ డోమైన్ లో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, సిపిఓ సత్యనారాయణరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వెంకన్నకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



**ఆంధ్ర ప్రదేశ్: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** పుంగనూరు శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవముల భాగంగా సోమవారం ఉదయం స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా సాయత్రం 06.00 గంటలకు ఆలయ మాడ వీధిలో సేనాధిపతి ఉత్సవం నిర్వహించి, 07.00 గంటల నుండి 08.30 గంటల వరకు ఆలయంలో విశ్వక్షేనారాధన, ఋత్విక్వర్ణం, కంకణ ధారణ, అంకురార్పణము, అర్చక బహుమానము తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా యాగశాల నందు కంకణ బట్టర్ శ్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్ని కార్యక్రమాలలో ఆలయ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, ఆలయ సిబ్బంది చెంగప్ప, ఉదయ్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# 50వేల సభ్యత్వాలు నమోదు చేయడమే లక్ష్యం: జనసేన పార్టీ నేత కోలా సోమశేఖర్




**ఆంధ్రప్రదేశ్: అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** 50 వేల సభ్యత్వలను నమోదు చేయడమే జనసేన లక్ష్యమని పుంగనూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కోల సోమశేఖర్ తెలిపారు. పుంగనూరు పట్టణంలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జి చిన్న రాయల్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలతో జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం పై సోమవారం సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీ నేత కోలా సోమశేఖర్ మాట్లాడుతూ పార్టీ కమిటీల్లో బాధ్యతలు అప్పగించేందుకు సభ్యత్వం తప్పనిసరి అన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి ఐదు లక్షల ప్రమాద బీమా ద్వారా కుటుంబానికి భరోసా లభిస్తుందన్నారు. నియోజక వర్గంలో 50వేల సభ్యత్వాలు నమోదు చేయడమే జనసేన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి చిన్నా రాయల్, సింగల్ విండో చైర్మన్ పగడాల రమణ, మణి, శివ, భార్గవ్ జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన మన్నేపల్లి కుటుంబ సభ్యులు

- ఖమ్మం నేత్రనిధికి నేత్రాలు దానం
- నేత్రదాన ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేత



**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గార్ల మండలం, కొత్త పోచారం గ్రామానికి చెందిన మన్నేపల్లి పూర్ణ చందర్ రావు ఇటీవల మృతి చెందడంతో ఖమ్మం నేత్రనిదికి నేత్రాలు దానంచేసి మన్నేపల్లి కుటుంబ సభ్యులు మానవత్వం చాటుకున్నారు. సోమవారం జరిగిన పూర్ణచందర్ రావు దశదిన కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులకు నేత్రదాన ప్రశంసా పత్రం, జ్ఞాపికను, ఖమ్మం నేత్రనిధి బాధ్యులు పగడాల నాగేశ్వరావు, ఐ డొనేషన్ కౌన్సిలర్ పోరండ్ల హరి ప్రసాద్ ల చేతుల మీదుగా అందజేశారు. నవ తెలంగాణ పత్రిక ఖమ్మం మాజీ జనరల్ మేనేజర్ మన్నేపల్లి సుబ్బారావు మాట్లాడుతూ... నేత్రదాన ప్రాముఖ్యతను వివరిస్తూ నేత్రదానం పట్ల అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అందరూ సమాజం మీద అవగాహనతో నేత్రాలు, అవయవాలు, బాడీ వంటివి వైద్య కళా శాలకు డొనేషన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) ఆఫీసు ఇంచార్జి ఆర్.ప్రకాష్, స్వేచ్ఛ టీవీ రిపోర్టర్ చింతా కొండలు, మన్నేపల్లి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పదవ తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

**- మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షల నిర్వహణ**

**- 98 పరీక్షా కేంద్రాలలో 16975 మంది విద్యార్థులు హాజరు**

**- పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**



**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లాలో పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సోమవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించే పదవ తరగతి పరీక్షలలో మన జిల్లాకు చెందిన 16975 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరవుతున్నట్లు, వీరి కోసం 98 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద అవసరమైన మేర భద్రత ఏర్పాట్లు కల్పించాలని అదనపు కలెక్టర్ పోలీస్ అధికారులకు సూచించారు. 6 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు ఏర్పాటు చేయాలని, ప్రతి ఫ్లయింగ్ స్క్వాడ్ లో డిప్యూటీ తహసిల్దార్, ఎస్ఐ సభ్యులుగా ఉండాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటుకు సిబ్బంది వివరాలు అందించాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షా సమయంలో ప్రతి పరీక్షా కేంద్రం చుట్టుపక్కల ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని అన్నారు. ప్రశ్న పత్రాల తరలింపుకు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో పెట్టాలని అన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా అవసరమైన రూట్ లలో బస్సులు నడపాలని అదనపు కలెక్టర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షల నేపథ్యంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. ప్రశ్న పత్రాలను సమీప పోలీస్ స్టేషన్ నందు భద్రపరిచి పరీక్ష రోజు బందోబస్తుతో పరీక్ష కేంద్రాలకు సకాలంలో సరఫరా చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమీషనర్ వై. లక్ష్మీప్రసాద్, విద్యాశాఖ ఏడి చావా శ్రీనివాస్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వెంకట్ సాయి ట్రాక్టర్ గ్యారేజీని ప్రారంభించిన మేయర్ కోలగని



**కరీంనగర్,ఫిబ్రవరి23(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణంలో వెంకట్ సాయి ట్రాక్టర్ గ్యారేజీని సోమవారం రోజున కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగని శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ట్రాక్టర్లకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. రైతుల వ్యవసాయ పనుల్లో ట్రాక్టర్లు కీలక భూమిక పోషిస్తున్నాయని,అలాంటి ట్రాక్టర్ల రిపేర్ల కోసం వెంకట సాయి గ్యారేజ్ ను ప్రారంభించినందుకు అభినందిస్తున్నాన్నారు. గ్యారేజీ యాజమాన్యం రిపేర్లకు వచ్చిన రైతుకు సంబంధించిన ట్రాక్టర్ల విషయంలో నామమాత్రపు రిపేరు చార్జీలు వసూలు చేసి వారికి అండగా నిలవాలని మేయర్ కోలగని శ్రీనివాస్ సూచించారు.

# రజకుల పై దాడులకు పాల్పడిన బాధ్యులను తక్షణమే అరెస్టు చేయాలి

- రజక సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలేపల్లి రాజు (మైఖేల్ )



**హన్మకొండ, ఫిబ్రవరి23(పీసీడబ్ల్యూ న్యూస్):** నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మెర శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలలో రెండు నెలల బాలికను బలి తీసుకున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని రజక సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేపల్లి రాజు (మైకెల్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పాత్రికేయ మిత్రులతో మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలకు పాల్పడిన నిందితులపై హత్య కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని రజక కుటుంబం పై దాడి చేసి రెండు నెలల చిన్నారని బలిగొన్న ఉపేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నంద్యాల శ్రీనివాస్ రెడ్డి, తుకారం రెడ్డి, సతీష్ రెడ్డి లను కఠినంగా శిక్షించాలని రజక కులానికి చెందిన చంద్రకళ కుటుంబం శ్రీ మల్లికార్జున స్వామి దర్శనం చేసుకుని వెళ్ళగా దర్శనం చేసుకోకుండా నిర్వాహకులు చంద్రకళ కుటుంబాన్ని అడ్డుకోగా ఎందుకు అడ్డుకుంటున్నారని అడిగిన చంద్రకళ కుటుంబాన్ని బూతులు తిడుతూ దుర్భాషలాడుతూ అతి కిరాతంగా క్రూరంగా చిన్నారిని కాలుతో తన్నిన దుర్మార్గులను సాంఘిక బహిష్కరణ చేయాలని కోరారు. నిందితులపై కేసు నమోదు చేయకుండా పక్షపాత ధోరణి అవలంబిస్తున్న అక్కడి పోలీసు అధికారులను శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని ముఖ్యంగా సీఐ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# " ఉద్యమకారుల పిటిషన్ పై కోర్ట్ తీర్పు హర్షనీయం: కలకోటి మహేందర్ న్యాయవాది



**హన్మకొండ, ఫిబ్రవరి 23(పీసీడబ్ల్యూ న్యూస్)** :హనుమకొండ బాల సముద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ ఉద్యమకారులు ఆనందాన్ని నింపింది తెలంగాణ రాష్ట్రానికి సైనికులుగా వ్యవహరించిన ఉద్యమకారులు ఊపిరి నూరింది అని తెలంగాణ ఉద్యమకారుడు న్యాయవాది కల్కోటి మహేందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ధ్యేయంగా ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వాలు మర్చిపోయినా ప్రజా విశ్వాసం ఉన్న రాష్ట్ర న్యాయస్థానం వారికీ అనుకూలంగా తీర్పునీయడం ఉద్యమ కారుల అందరి గుండెల్లో ఆనందాన్ని నింపింది అని ఉద్యమకారుడు న్యాయవాది కలకోటి మహేందర్ అన్నారు. నీళు నిధులు నియామకాల కోసం ప్రత్యేక రాష్ట్రం అవసరమని ప్రాణాలు తెగించి పోరాడిన ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా ఉద్యమించిన వారిని గుర్తించి ప్రతి వారికి 250 గజాల ఇళ్లస్థలం తో పాటు 25 వేల రూపాయల పెన్షన్ ఇతర సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళా నాయకులు గోల్కొండ బుచ్చన్న పారునుంది ఈశ్వర ప్రసాద్, గోవిందు ఆనంద్, అంకిళ్ల సదానందం, మంద మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సంక్షేమానికి 5వేల కోట్లు కేటాయించాలి

- మత్స్యకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పగడాల నాగేశ్వరరావు



**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం వచ్చే 2026- 27 సంవత్సర ప్రణాళిక బడ్జెట్లో మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి 5వేల కోట్ల రూపాయలు కేటాయించాలని మత్స్యకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పగడాల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం గ్రీవెన్స్ డేలో ఖమ్మం జిల్లా కలెక్టర్, జిల్లా మత్స్యశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. గత 12 సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా చనిపోయిన మత్స్యకారుల కుటుంబాలకు ఇవ్వాల్సిన ఎక్స్ గ్రేషియో, పెండింగ్ లో ఉన్న 986 కేసులకు ఈ బడ్జెట్లో నగదు కేటాయించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని, మత్సకార కుటుంబాల జీవిత భద్రతకు ఇన్సూరెన్స్, ఎక్స్ గ్రేషియో రూ.20 లక్షలకు పెంచాలి, అనారోగ్యం, గుండెపోటు ఇతర వ్యాధులతో చనిపోయిన వారికి కూడా వర్తింప చేయాలని, తక్షణ ఆర్థిక సహాయం కింద రెండు లక్షల రూపాయలు వెంటనే ఇవ్వాలని, ప్రతి మత్స్య సొసైటీ జల వనరులకు సరిపడేంత చేప పిల్లలు, రొయ్య పిల్లలు కొనుగోలు కోసం 100శాతం సబ్సిడీతో నేరుగా మత్స్య సొసైటీ ఖాతాలోనే నగదు జమ చేయాలి. టెండర్ల విధానాన్ని రద్దు చేయాలని, మత్స్యమిత్ర మహిళా గ్రూపుల స్కీమును పునరుద్ధరించాలి. ప్రతి గ్రూపుకు ఎలాంటి షరతులు లేకుండా 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించాలని, మత్స్యకార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సంఘం జిల్లా నాయకులు డి. శ్రీనివాస్, ఎస్. కృష్ణారావు, ఆర్. ప్రకాష్, చింత కొండల్, హరి తదితరులు పాల్గొన్నారు.

# సంసద్ ఖేల్ మహోత్సవ్ పేరిట క్రీడా పోటీలు మార్చి 1 నుండి 7 వరకు ...

- జరగబోయే క్రీడా పోటీలు యువ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఎంతో దోహదం: బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి.....




**కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 23(పిసిడబ్ల్యూ న్యూస్):** సంసద్ ఖేల్ మహోత్సవ్ పేరిట క్రీడా పోటీలు మార్చి 1 నుండి 7 వరకు జరుగుతాయని, ప్రధానంగా పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మార్చి ఒకటి నుండి 3 వరకు , గెలుపొందిన జట్లకు 5,6,7 తేదీల్లో కరీంనగర్ హెడ్ క్వార్టర్ లో ఈ క్రీడా పోటీలు కొనసాగుతాయని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం రోజున కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో సంసద్ ఖేల్ మహోత్సవ్ నిర్వహణ ఏర్పాట్ల కోసం బీజేపీ ముఖ్య నేతలు, ఇన్చార్జిలతో సన్నాక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని స్పోర్ట్స్ పవర్ హౌస్ గా మార్చాలని విజన్ పెట్టుకున్నారని, ఆ దిశలోనే ప్రతి ఏటా ఖేల్ మహోత్సవ పేరిట క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీల నిర్వహణ వల్ల ముఖ్యంగా ఎంతోమంది క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసే అవకాశం ఉంటుందన్నారు. జరగబోయే క్రీడా పోటీలను పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, హాకీ, అట్లాటిక్స్లో 100, 400 మీటర్ల పరుగు పందెం, హై, లాంగ్ జంప్, షాట్ పుట్, జావలన్, డిస్క్ త్రో లాంటి ముఖ్యమైన క్రీడా పోటీలను నిర్వహిస్తున్నందున, ఆయా క్రీడా పోటీల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులందరూ పాల్గొని ఖేల్ మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఆయా క్రీడా పోటీల్లో పాల్గొనడానికి ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఈనెల 25 నుండి 27 వరకు అసెంబ్లీ వారిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి , కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్, కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు , జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దురిశెట్టి సంపత్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీలతో పాటు అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్పొరేటర్లు, నాయకులు, ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.



# పరిపాలనలో ఏఐ వినియోగంతో వేగవంతమైన సేవలు

### క్లాడ్ టెక్నాలజీపై జిల్లా అధికారులకు కలెక్టర్ అవగాహన

### మెరుగైన పనితీరుకు ఏఐ సాధనాల వినియోగం అవసరం: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరిపాలనలో ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుంటే ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శక సేవలు అందించవచ్చని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధికారులకు ఏఐ సాంకేతికత "క్లాడ్" వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏఐ టూల్స్ వినియోగంతో 23 గంటలు పట్టే పనులను నిమిషాల్లో పూర్తి చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా నివేదికల తయారీ, డేటా విశ్లేషణ, పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు, ఎక్సెల్ ఫార్ములాల వినియోగంలో క్లాడ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. అవసరమైన అంశాలను స్పష్టంగా అందిస్తే, క్లాడ్ వేగంగా సమగ్రమైన ప్రజెంటేషన్ సిద్ధం చేస్తుందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు వంటి కీలక అంశాల్లో గత ఐదేళ్ల డేటాను అప్‌లోడ్ చేస్తే పెండింగ్‌లో ఉన్న రైస్ మిల్లర్ల జాబితాను క్షణాల్లో అందిస్తూ, ఎక్కడ దృష్టి సారించాలో సూచించగలదని తెలిపారు. ప్రతి శాఖలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల పురోగతి పర్యవేక్షణలో కూడా ఏఐ సాధనాలను వినియోగించాలని సూచించారు. క్లాడ్ వంటి ఏఐ సాధనాలను వినియోగిస్తున్నప్పటికీ, అధికారులు ఎల్లప్పుడూ పర్యవేక్షణ చేయాలని ఆయన స్పష్టం చేశారు. సిబ్బంది పని తీరు మెరుగుపర్చడంలో, కార్యాలయ విధులను సమర్థవంతంగా నిర్వహించడంలో, తక్కువ సమయంలో మెరుగైన ఫలితాలు సాధించడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. అవసరాలకు అనుగుణంగా యాప్‌లను అభివృద్ధి చేసుకునే అవకాశమూ ఉందని తెలిపారు. వచ్చే వారం తమ శాఖల్లో ఏ విధంగా క్లాడ్‌ను వినియోగించవచ్చో కనీసం ఇద్దరు అధికారులు ప్రజెంటేషన్ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారులకు త్వరితగతిన చేర్చడంలో, శాఖాపరమైన అమలు సమర్థవంతంగా జరిగేలా చేయడంలో ఏఐ సాంకేతికత ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.


# 66వ డివిజన్ గాంధీ నగర్ కాలనీలో రోడ్డు పనులను పరిశీలించిన డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్





**హన్మకొండ,ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** వర్ధన్నపేట శాసనసభ్యులు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు సోమవారం గ్రేటర్ వరంగల్ హసన్ పర్తి 66వ డివిజన్ లో రాంనగర్ మరియు గాంధీనగర్ వరకు జరుగుతున్న సిసి రోడ్డు పనులను రోడ్డు వెడల్పును మరియు నాణ్యతను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. ప్రజలకు మౌలిక సదుపాయాలు మరింత మెరుగ్గా అందించడమే ప్రభుత్వ లక్ష్యం. అభివృద్ధి పనుల్లో నాణ్యతే ప్రధానమని, నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు త్వరగా పన్ను పూర్తి చేయాలని కోరారు కొన్ని సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలనే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు ప్రజల ప్రాథమిక అవసరాలైన తాగునీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం వసతులు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి 66 డివిజన్‌లో సమానంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి, ఓపెన్ జిమ్ త్వరలో చెరువు కట్టపై కూడా నిర్మాణం చేస్తున్నామని అన్నారు ప్రజలకు ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను ప్రజలు విశ్వసించవద్దని, వాస్తవాలు, పనులే తన పాలనకు నిదర్శనమని అన్నారు. రాజకీయాలకు అతీతంగా, కులమత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే పాలన అందిస్తున్నామని .ప్రజల ఆశీర్వాదం ఎప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎర్రగట్టు గుట్ట దేవస్థానం చైర్మన్ జన్ను రవీందర్, ఎర్రగటు గుట్ట చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి మాజీ సర్పంచ్ పుల్ల రవీందర్ యూత్ ప్రెసిడెంట్ తాళ్ల మధు మండల సోషల్ మీడియా కో..ఆర్డినేటర్ బిగుళ్ల సురేష్. తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# "రజకుల గౌరవం కాపాడే వరకు పోరాటం ఆగదు": మునుకుంట్ల నాగరాజు



తెలంగాణ రజక సంఘాల సమితి ఉమ్మడి జిల్లాల యువజన విభాగం అధ్యక్షులు మునుకుంట్ల నాగరాజు

**పరకాల, ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** నాగర్ కర్నూలు జిల్లాలోని కుమ్మేర గ్రామంలో జరిగిన అమానుష ఘటనపై తెలంగాణ రజక సంఘాల సమితి ఉమ్మడి జిల్లాల యువజన విభాగం అధ్యక్షుడు మునుకుంట్ల నాగరాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ మల్లిఖార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రజకులపై కులవివక్షతో ప్రవర్తిస్తూ, అనుమతి లేకుండా గుడిలోకి వచ్చారంటూ అసభ్య పదజాలంతో దూషించడం దుర్మార్గమని ఆయన ఖండించారు. రెండు నెలల పసిపాపను కాలితో తన్ని ప్రాణాలు తీసిన ఘటన అమానుషానికి పరాకాష్ట అని నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడవారిని కూడా అవమానిస్తూ దాడికి దిగడం సమాజం తలదించుకునే విషయం అని అన్నారు.


అగ్రకుల అహంకారంతో రాచరిక ధోరణిలో వ్యవహరించిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పాప మృతికి కారణమైన నిందితులను అరెస్ట్ చేసి వేగవంతమైన విచారణ జరిపి గరిష్ట శిక్ష విధించాలని, బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. కుల వివక్షకు రాష్ట్రంలో స్థానం లేదని నిరూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. "రజకుల గౌరవం కాపాడే వరకు మా పోరాటం ఆగదు" అని మునుకుంట్ల నాగరాజు హెచ్చరించారు.

# ఎఫ్ఎస్‌టీ వీడియో గ్రాఫర్లకు కూలి చెల్లించాలి

- అధికారుల నిర్లక్ష్యంపై భాస్కర్ ఆగ్రహం

**పరకాల, ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ఎఫ్ఎస్‌టీ (ఫ్లయింగ్ స్క్వాడ్ టీం)ల్లో వీడియో గ్రాఫర్లుగా విధులు నిర్వర్తించిన వారికి ఇప్పటికీ కూలి చెల్లింపులు జరగకపోవడం పట్ల ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్గనైజర్ కోడెపాక భాస్కర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరకాల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఫస్ట్ షిఫ్ట్, సెకండ్ షిఫ్ట్‌లలో కష్టపడి పనిచేసిన వీడియో గ్రాఫర్లు ఎన్నిసార్లు ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో అధికారుల ఆదేశాల మేరకు ఎండలో, వర్షంలో విధులు నిర్వర్తించిన తమకు రావలసిన పారితోషికం ఆలస్యం కావడం అన్యాయమని భాస్కర్ పేర్కొన్నారు. చిన్న చిన్న స్టూడియోలు నడుపుకుంటూ జీవనం సాగించే వీడియో గ్రాఫర్లు ఎన్నికల బాధ్యతలు నిర్వర్తించేందుకు ఇతర పనులను కూడా వదిలివేసి పనిచేశారని గుర్తుచేశారు. అయినప్పటికీ నెలలు గడిచినా కూలి అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని భాస్కర్ డిమాండ్ చేశారు. లేకపోతే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో సేవలందించిన వీడియో గ్రాఫర్లకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



# నేరాల నియంత్రణలో జాగిలాల పాత్ర కీలకం

- భద్రతకు పోలీసు జాగిలాలు భరోసా: పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పోలీస్ జగిలాలు (పోలీస్ డాగ్స్) నేర పరిశోధన, భద్రతా చర్యలు, మాదకద్రవ్యాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్నాయిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. హైదరాబాదులోని ఐఐటీఏ మొయినాబాద్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొంది ఖమ్మం పోలీస్ కమిషరెట్ కు కేటాయించబడిన పింకీ, రోక్సీ అనే రెండు పోలీస్ జగిలాలతో డాగ్ హ్యాండ్లర్ హ్యాండ్లర్ బి.రవి, టి. అచ్యుత్, కె.గౌతమ్ కుమార్ సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ కి రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. శిక్షణా సామర్థ్యం వల్ల పోలీసులు విభిన్న ఆపరేషన్లలో పోలీస్ జగిలాలను వినియోగిస్తున్నారని తెలిపారు. విశ్వాసానికి మారు పేరుగా నిలిచే జాగిలాలు పోలీస్ శాఖకు నేర పరిశోధనలో కీలకంగా మారుతున్నాయిని, హత్యలు, దోపిడీలు, దొంగతనాలు జగిన సమయంలో నిందితులను పట్టించడం, సంఘ విద్రోహులు అమర్చే పేలుడు పదార్థాలను గుర్తించి భారీ ప్రాణ, ఆస్తి నష్టం నివారించడంలో పోలీసు జాగిలాలు అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నాయిని అన్నారు. జిల్లా పోలీస్ పరేడ్ మైదానం దగ్గర బెల్జియం బ్రెడ్ చెందిన నార్కోటిక్ పసిగట్టే డాగ్ పింకీ, లాబ్రడార్ రిట్రీవర్ బ్రెడ్ చెందిన పేలుడు పదార్ధాలను గుర్తుంచే డాగ్ రోక్సీ జగిలాల కోసం ప్రత్యేక గదులు, సరైన వసతులను ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు.

# అక్కంపేటలో గుడుంబా తయారీదారుడి అరెస్ట్

### 10 లీటర్ల గుడుంబా స్వాధీనం అలవాటుగా నేరాలకు పాల్పడుతున్న వ్యక్తి రిమాండ్





**ఆత్మకూరు, ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** అక్రమంగా గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తిని ఆత్మకూరు పోలీసులు అరెస్టు చేసి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారండ విశ్వసనీయ సమాచారం మేరకు ఆత్మకూరు ఎస్ఐ పి. తిరుపతి తన సిబ్బందితో కలిసి అక్కంపేట గ్రామంలో దాడి నిర్వహించారు. గ్రామానికి చెందిన పోరిక మురళి (తండ్రి గమ్య), ప్రస్తుతం అక్కంపేటలో అద్దె ఇంటిలో నివసిస్తూ గుడుంబా తయారీ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దాడి సమయంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, తెలంగాణ ప్రభుత్వ నిషేధాన్ని అతిక్రమిస్తూ గుడుంబా తయారీ చేసి అమ్ముతున్నట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి సూచన మేరకు ఒక గన్నె సంచి, 10 లీటర్ల గుడుంబా ఉన్న ప్లాస్టిక్ డబ్బాను మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 25/2026 కింద టీఎస్ ఎక్సైజ్ చట్టం సెక్షన్ 7(ఎ) r/w 8(ఇ) ప్రకారం కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని గౌరవ న్యాయస్థానంలో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరిక మురళి అలవాటుగా గుడుంబా నేరాలకు పాల్పడుతున్న వ్యక్తి. గతంలో కూడా క్రైం నంబర్ 85/2025 కింద టీఎస్ ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసు నమోదు కాగా, మరో రెండు గుడుంబా కేసుల్లోనూ అతడు నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. అక్రమంగా గుడుంబా తయారీ, విక్రయాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

# పథకాలు సాధించిన క్రీడాకారులకు అభినందనలు: పోలీస్ కమీషనర్ సునీల్ దత్




**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 23 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో పతకాలను సాధించిన ఖమ్మం కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సోమవారం అభినందించారు. ముందుగా పతాకాలను సాధించిన పోలీస్ క్రీడాకారులు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఒక్కొక్కరిని ప్రత్యేకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఖమ్మం కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు రాష్ట్రాస్థాయిలో క్రీడల్లో అద్భుత ప్రదర్శనతో 15 బంగారు పతకాలు, 8 రజిత పతకాలు, 16 కాంస్య పతకం మొత్తం 39 పతకాలను కైవసం చేసుకోవడం అభినందనీయమని పోలీస్ కమిషనర్ అన్నారు. ఇదేస్ఫూర్తితో భవిష్యత్‌లో జాతీయ స్థాయి పోలీస్ క్రీడల్లో ప్రతిభను కనబరిచి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. పతకాలను సాధించేందుకుగా ముమ్మరంగా సాధన చేయాలని, క్రీడల్లో రాణించే వారికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పోలీస్ కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఏఆర్) కుమారస్వామి, అడిషనల్ డీసీపీ విజయబాబు, ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ఐలు సురేష్, సాంబశివరావు, క్లూస్ టీం ఇన్స్పెక్టర్ నరేష్ పాల్గొన్నారు.

# పెళ్లికోసం ఉదయ్‌పూర్‌కు



టాలీవుడ్ క్రేజీ జంట విజయ్ దేవరకొండ– రష్మిక మందన్నా పేర్లు గత కొద్ది రోజులుగా నెట్టింట హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. వీరిద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ నడుస్తుందని ప్రచారం జరుగుతున్న వేళ ఎట్టకేలకు వధూవరులుగా పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. ప్రేమ, పెళ్లిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన తరువాత పెళ్లి వేడుకల సందడి మొదలైంది. ఈ నెల 26న వివాహం జరగనుండగా, వేడుక కోసం ఈ జంట రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు బయల్దేరింది. ఎయిర్‌పోర్ట్‌లో కనిపించిన వీరి వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ వెంట ఆయన సోదరుడు ఆనంద్ దేవరకొండ ఉన్నారు. ఇప్పటికే ఉదయపూర్ ప్యాలెస్‌లో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వివాహం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. గత కొంతకాలంగా వీరి ప్రేమ, పెళ్లిపై వార్తలు జోరందుకున్నాయి. సోషల్ మీడియాలో ఒకే పోస్ట్‌తో పెళ్లి విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అభిమానులు ప్రేమగా పిలిచే 'విరోష్' పేరునే తమ వివాహానికి శీర్షికగా పెట్టామని పేర్కొన్నారు. మీరు ప్రేమగా పెట్టిన పేరు 'విరోష్'. మీ అందరి ఆశీర్వాదాలతో జంటగా మీ ముందుకు వస్తున్నాం. 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్" అంటూ ఎమోషనల్‌గా రాసుకొచ్చారు. ఉదయపూర్‌లో పెళ్లి అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని ఓ లగ్జరీ హోటల్‌లో వేడుకకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. టాలీవుడ్ టాప్ సెలబ్రిటీలు, పలువురు రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని సమాచారం. లఅభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ కలల కపుల్ పెళ్లి వేడుక సోషల్ మీడియాలో మరింత సందడి చేయనుంది.

----------------


# త్రివిక్రమ్-వెంకి కాంబోలో ఎకె 47




టాలీవుడ్‌లో రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం ఎకె 47' విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లకు మంచి స్పందన వస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇప్పటివరకు 40 శాతం షూటింగ్ పూర్తవగా వెంకీ టీం దుబాయ్‌కు వెళ్లనుందట. 10 రోజులపాటు దుబాయ్‌లో సాగనున్న షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను ప్లాన్ చేసిందట త్రివిక్రమ్ టీం. దుబాయ్‌లో వచ్చే సీన్లు సినిమాను ఎలివేట్ చేసేలా రిచ్‌గా ఉండబోతున్నాయని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ మూవీలో పాపులర్ తమిళ కమెడియన్ యోగిబాబు కూడా నటిస్తున్నట్టు తెలుస్తోండగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే సినిమా షూటింగ్ జూన్ కల్లా పూర్తి కానుందని సమాచారం. ఇప్పటికే 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి హిట్ చిత్రాలకు రైటర్ హీరో కాంబోగా కలిసి పనిచేసిన త్రివిక్రమ్–వెంకీ ఇప్పుడు డైరెక్టర్ హీరోగా మొదటిసారి చేతులు కలపడంతో సినిమాపై క్యూరియాసిటీ పెరిగిపోతుంది. ఇటీవల విడుదలైన టైటిల్ అనౌన్స్‌మెంట్, ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచేస్తున్నాయి. ఈ సినిమాలో కేజీఎఫ్ ఫేం శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఈ మూవీని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తోపాటు క్రైం ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తోంది.

# ది ప్యారడైజ్ ప్రోమో సాంగ్ విడుదల

నాని హీరోగా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. మోహన్‌బాబు కీలకపాత్రలో కనిపించనున్నారు. ఆగస్టు 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దీని మొదటి పాటను విడుదల చేసేందుకు





సిద్ధమయ్యారు. తాజాగా 'ఆయా షేర్' అనే సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. పూర్తి పాట ఫిబ్రవరి 24న రానుంది. అనిరుధ్ అందించిన సంగీతం జోష్ పెంచేలా కనిపిస్తోంది. ఇదిలావుంటే నేచురల్ స్టార్ నాని వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. 'ది ప్యారడైజ్'లో నాని పూర్తిగా కొత్త గెటప్‌లో, ఊర మాస్ క్యారెక్టర్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ పాత్ర కోసం ఆయన తన లుక్‌ను పూర్తిగా మార్చుకోవడం విశేషం. రగ్డ్ స్టైల్, ఇంటెన్స్ బాడీ లాంగ్వేజ్‌తో నాని మరోసారి మాస్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తోంది. 'దసరా'లో చూపించిన రా ఎనర్జీకి మించి ఈసారి మరింత పవర్‌ఫుల్ ప్రెజెన్స్ ఉంటుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి.

# ఉస్తాద్ భగత్ సింగ్ సెకండ్ సింగిల్ కు విశేష స్పందన

పవర్ స్టార్ పవన్ కల్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా నుంచి రెండో పాట విడుదలైంది. 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పేరుతో విడుదలైన ఈ పాట యూట్యూబ్‌లో విశేష స్పందనతో దూసుకెళ్తోంది. ముఖ్యంగా పవన్ అభిమానులను ఈ పాట ఉర్రూతలూగిస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.

దేవి శ్రీ ప్రసాద్ స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ పవర్‌ఫుల్ సాహిత్యం అందించారు. 'నేను మెడ ముట్టుకుంటే, తొడ కొట్టినట్టే' అనే హుక్ లైన్‌తో మొదలయ్యే ఈ పాట, పవన్ కల్యాణ్ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఉండటంతో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీలో జరిగిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో అభిమానుల మధ్య ఈ పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ, పవన్ గత రెండు దశాబ్దాలుగా మెడ పట్టుకోవడం ఒక మేనరిజంగా చేస్తున్నారన్నారు. దానికి మాట రూపం ఇస్తే బాగుంటుందని 'నేను మెడ ముట్టుకుంటే, తొడ కొట్టినట్టే' అనే డైలాగ్ రాశానని చెప్పారు. దాన్నే హుక్ లైన్‌గా తీసుకుని చంద్రబోస్ కేవలం 8 గంటల్లో అద్భుతమైన పాట రాశారని తెలిపారు. ఇది పవన్‌పై అవగాహనతో రాసిన పాట అని, దేవిశ్రీ పాటాభిషేకం చేస్తే, చంద్రబోస్ సిరాభిషేకం చేశారని ప్రశంసించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. చిత్రాన్ని ఈ ఏడాది మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పాటతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.





# అల్లువారింట పెళ్లి సందడి

## పవన్, నాగబాబు దంపతులకు ఆహ్వానం

అల్లు వారింట పెళ్లి పనులు ఫుల్ జోష్‌లో జరుగుతున్నాయి. ఒకవైపు పసుపు దంచే కార్యక్రమాలు.. మరోవైపు బ్యాచిలర్ పార్టీలతో కొన్ని రోజుల నుంచి శిరీష్-నయనికల ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబును పెళ్లికి ఆహ్వానించారు. సతీ సమేతంగా పవన్ కల్యాణ్, నాగబాబుల ఇళ్లకు వెళ్లిన అల్లు అరవింద్.. వారికి నూతన వస్త్రాలు అందించి పెళ్లికి పిలిచారు. మార్చి 6న అల్లు శిరీష్ -నయనిక ఒకటి కానున్నారు. ఈ వేడుకకు ఇప్పటికే చిరంజీవికి ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. ఇటీవలే పసుపు దంచే కార్యక్రమం జరిగింది. ఆ ఫొటోలను అల్లు అర్జున్ సతీమణి స్నేహ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. హైదరాబాద్‌లోనే వీరి పెళ్లి జరగనున్నట్లు తెలుస్తోంది. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు ఈ వేడుకకు హాజరవుతారని సమాచారం. ఇక ఇటీవలే దుబాయ్‌లో ఫ్రెండ్స్ సర్కిల్‌కు బ్యాచ్‌లర్ పార్టీ ఇచ్చారు.

# నేను ఎక్కడ ఉంటే అదే నా ఇల్లు : శ్రుతి హాసన్



నటి, గాయని శ్రుతి హాసన్ 'ఇల్లు' అనే భావనపై తనదైన శైలిలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇల్లు అంటే మ్యాప్‌లోని ఒక ప్రదేశం కాదని, అది ఒక లోతైన, వ్యక్తిగతమైన ఫీలింగ్ అని ఆమె అన్నారు. పలు భాషా చిత్ర పరిశ్రమల్లో పనిచేసిన అనుభవంతో, తనకు ఇల్లు అనే భావనపై అవగాహన పూర్తిగా మారిపోయిందని శ్రుతి తెలిపారు.

ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ, "నాకు ఇల్లు అంటే అస్సలు భౌగోళిక ప్రదేశం కాదని గ్రహించాను. చెన్నైకి వెళ్లినప్పుడు నాకు అనంతమైన ప్రేమ, సౌకర్యం లభిస్తాయి. ముంబైలో మరో రకమైన ప్రేమను పొందుతాను. హైదరాబాద్‌లో పనిచేస్తున్నందున ఇక్కడ భిన్నమైన అనుబంధం ఉంటుంది" అని వివరించారు. ప్రతి నగరం తనకు ప్రత్యేకమైన అనుభూతిని పంచిందని ఆమె చెప్పారు. అయితే కాలక్రమేణా ఒక ముఖ్యమైన విషయాన్ని గ్రహించానని ఆమె తెలిపారు. "నన్ను ఎక్కడైనా వదిలేసినా, నేను సౌకర్యాన్ని వెతుక్కోగలను. ఒక ప్రదేశం, అక్కడి ప్రజలు, సంస్కృతి గురించి తెలుసుకుని, అందులో నాకు నచ్చిన దాన్ని నా సొంతం చేసుకుంటాను. నిజానికి నేను ఎక్కడ ఉంటే అదే నా ఇల్లు" అని శ్రుతి పేర్కొన్నారు. నాలో నాకు సౌకర్యంగా లేనప్పుడు, సొంత ఇంట్లో ఉన్నా సరే అసౌకర్యంగానే అనిపిస్తుందని అన్నారు. "నాకు నేనే ఇల్లు అనే భావన నా మెదడులో బలంగా నాటుకుపోయింది. జీవితంలో దేన్నైనా ఎదుర్కోవడానికి ఇది నాకు గొప్ప భద్రతను, భరోసాను ఇచ్చింది. ఈ ఆలోచన స్వార్థంగా అనిపించినా, నాకు బాగా పనిచేసింది. నాన్న (కమల్ హాసన్) తప్ప మరే వ్యక్తి నాకు ఇల్లులా సౌకర్యవంతంగా అనిపించలేదు" అని శ్రుతి స్పష్టం చేశారు.